అభినవసరస్వతి

సంపుటము ౨౯ | ఈశ్వరనామ సంవత్సరము మాఘమాసము | సంచిక ౧౧

కృతివిమర్శము

మున్నూరుకాఁపుకులచరిత్ర— ఇయ్యది హైదరాబాదులోని మున్నూరు కాఁపుతెగకుఁజేరిన నవయువకమండలిచేఁ బ్రకటితము. మున్నూరు విశేషణముచే స్వసంఘమున కేదో హైన్యమును శంకించి తదపనోదనార్థ మీయువకులు చరిత్ర సంశోధనము చేయుచు నిట్టిగ్రంథములు ప్రచురించుచున్నారు. ఈగ్రంథము చిలుకూరు వీరభద్రరావుగారి యాంధ్రులచరిత్ర ౩వ సంపుటమునుండి తీసి ప్రచురింపఁబడియెను. ఇందు వీరభద్రరావుగా రుదయగిరి చంద్రగిరిరాజ్యములను బరిపాలించిన సాళువ నరసింహరాయల సేనానియు మంత్రియు సామంతమండలాధీశ్వరుఁడు నగు నార్వీటి బుక్కభూపాలు నుద్దేశించి దేవరాజను నొక బట్టుకవి పఠించినదని యుదాహరించిన

సీ॥ పంటాన్వయమునను బదునాల్గుశాఖల
చక్కఁగా వివరింతు సత్యమరసి
మోటాటి వెల్నాటి మొరసు నేర దయోధ్య
పంట పొంగలినాటి పాకనాఁటి
భూమంచి కుంచేటి మున్నూటి గోకేటి
ఒనర గండికోట యోరుగంటి
అనఁబరఁగుచునుండు నాంధ్రావనీస్థలి
గౌరవాధిష్ఠిత కాఁపుకులము.
పంటపదునాల్గుకులములం చుంట జగతి
తరతరంబులనుండియు వరలెడి నుడి.
వీని కుపజాతు లున్నవి వివిధములుగ
భుజబలాటోప! పిన్నమ బుక్కభూప!

అనుపద్యమువలన 15 వ శతాబ్దిలో మున్నూటివారు మోటాటి పాకనాటి వారితోపాటు పదునాల్గువిధములైన పంటకాఁపులలోఁ బరిగణింపఁబడియున్నట్లు స్పష్టపడుచున్నది. మఱియు నీరావుగారు జనకమహారాజు సీతను శివునివిల్లు విఱిచిన వాని కిచ్చి వివాహముఁజేయుదునని చాఁటింపింప శ్రీరామచంద్రమూర్తి యేమహా

రాజునకును సాధ్యముకాని యీమహాకార్యమును ద్రేతాకాలములో నిర్వహించె ననియు నాశివధనుస్సును సభాస్థలికి మున్నూఱుగురు మోసికొనివచ్చినట్లు శ్రీభాగవతమునఁ జెప్పఁబడియెననియు నామున్నూఱుగురి సంతానమే మున్నూఱు వారనియు వీరు కాఁపులలో నొకశాఖవారనియుఁ జేసిన యూహాగూడ నురరీకరింపఁదగి యున్నది. వీరికి మిథిలకాఁపులనికూడఁ బ్రథితి యున్నదని యోగిరాల సుబ్బారావు గారు వ్రాసిరఁట. ఈవ్రాఁతను సమర్థించుచు వీరభద్రరావుగారు వ్రాసినదిమాత్రము విద్వదంగీకృతము కానేరదు.

త్రేతాయుగమున విదేహదేశము పంటకాఁపులకుఁ బ్రధానస్థానముగ నుండెనఁట. వీరలకుఁ బ్రభువై జనకమహారాజు మిథిలానగరము రాజధానిగ విదేహదేశమును బరిపాలించిన కాఁపుమహారాజే యఁట. జ్ఞానవంతుఁడై క్రమముగా రాజర్షి గాఁ బరిణామముఁజెంది పిమ్మట బ్రహ్మణ్యుఁ [బ్రాహ్మణుఁ]డై యుండెనని బ్రాహ్మణాద్యుపనిషద్గ్రంథము లుద్ఘోషించుచున్నవఁట. ఇందలి త్రేతాయుగము గాంధియుగమువంటిదికాని కలియుగాదులవలెఁ దొలుతటిదికాదు. జనకమహారాజు పంటకాఁపులకుఁ బ్రభు వయిన నగుఁగాక. కాఁపుమహారాజుమాత్రము కాఁడు. క్రమముగా బ్రహ్మణ్యుఁ డయ్యెనుగాని బ్రాహ్మణుఁడు కాలేదు. తచ్ఛబ్దవాచ్యుఁడైనను నయ్యది యాయన బ్రహ్మజ్ఞతా ప్రతిపాదకము కాని జాతివాచకము కాదు. ఈయన బ్రహ్మణ్యతయో బ్రాహ్మణతయో యుపనిషత్తు లుద్ఘోషించినను నయ్యవి బ్రాహ్మణాది సంజ్ఞలచే భాసిల్లవు. జనకుఁడు సీతాప్రదానసమయమున స్వీయవంశక్రమము శిష్టుఁడైన వసిష్ఠునితో

శ్లో॥ ప్రదానేహి మునిశ్రేష్ఠ కులం నిరవశేషతః
వక్తవ్యం కులజాతేన తన్నిబోధ మహామునే
రాజాభూత్త్రిషు లోకేషు విశ్రుతస్స్వేన కర్మణా
నిమిః పరమధర్మాత్మా సర్వసత్త్వవతాం వరః
తస్య పుత్రో మిథిర్నామ మిథిలా యేన నిర్మితా
ప్రథమో జనకో నామ జనకాద ప్యుదావసుః.

అని చెప్పికొని వచ్చివచ్చి తుదకు

శ్లో॥ స్వర్ణరోమ్ణస్తు రాజర్షే ర్హ్రస్వరోమా వ్యజాయత
తస్య పుత్రద్వయం జజ్ఞే ధర్మజ్ఞస్య మహాత్మనః
జ్యేష్ఠోహ మనుజో భ్రాతా మమ వీరః కుశధ్వజః

(వాల్మీకిరామాయణము ; బాలకాండము ; ఏకసప్తతితమసర్గము)

అని ముగించెను. ఇట్లు నిమిచక్రవర్తి పరంపరాగత సుక్షత్రియుఁడైన జనక మహారాజు కాఁపుమహారాజు కావింపఁబడుట కడుంగడు శోచనీయము. మూల పురుషుఁడగు నిమి పుత్రుఁడు మిథియే మిథిలానగర నిర్మాత. ఈ మిథికి సీతతండ్రి

21 తరమువాఁడని రామాయణకథను సూచించుచును మరల నేలూరి రావుగారు కాఁపుమహారాజని కడకు నుడివిరి. మున్నూలువారిమున్నీటి విశేషణముచే స్వసంఘమునకు దోసంగు శంకించుకొని మున్నూలును మున్నీరుఁజేయఁజూచుట మూర్ఖత్వసూచకమును మోసమును, వీరు విఘ్నవర్ధనుని దాడికి భయపడి తెజ్జిగొల్లలలోఁ జేరిన విట్కృతత్రియపుఁ బరంపరయనుటకుఁగూడ విద్వాంసు లంగీకరింపరు. స్వపూర్వవీరుల స్మారకచిహ్నముగా వివాహానంతరము వీరిచేఁ జేయఁబడు వీరులకొలుపులే దీనిఁ బూర్వపక్షము గావించెడిని. పాలుబోతు పరంపరయే యైనఁ బరిణయములలోఁ గరవాలములఁ ద్రిప్పుచును వీరవ్యాహారముల వివరించుచును వారి బంధువులు వధూవరుల నాశీర్వదింపరు ఇత్యాదికారణములచే నీమున్నూలువారు మున్నూటికులమని యెన్నఁదగక మోటాటికాఁపులు మున్నగువారుం బోలె ముఖ్యశూద్రులలోఁ బరిగణింపఁదగినవారని ప్రతిపాదించు నీ మున్నూలుకాఁపులచరిత్ర సన్నుతింపఁదగియున్నదని యస్మదభిప్రాయము.

పార్వతీపరిణయము—హరికథ. గ్రంథకర్త శ్రీరామకవచము, అనంతశాస్త్రి గారు. నారాయణపురము, నల్లగొండజిల్లా. దీనివెల 0-8-0 హరికథారూప గేయ గ్రంథ మయ్యు నియ్యది సలక్షణమును లలితమృదుమధురపదభూయిష్ఠమును.

ఆ. వె. కొఱవితోఁడఁ దలను గోఁకికొన్నట్టు ల్లా
కాలకాలుతోఁడఁ గాలుద్రివ్వి
కండక్రొవ్వునఁ బగఁ గలిగించుకొన్న యా
దక్షుఁ డెట్టిపాట్లఁ దవులఁగలఁడొ ?

మొదలగుపద్యములును బదములును లోకోక్తులు మొదలగువానితో నాకర్ణనీయములై యలరారెడిని.

స్తుతిమాలికా ద్వితీయసరము—ఇది తక్కెళ్ళపాడగ్రహారవాస్తవ్యులగు శ్రీమదుభయవేదాంతప్రవర్తక శ్రీమదద్దంకి తిరుమలసమరోద్దండకోలాహల లక్ష్మీనృసింహకుమార తిరువేంకటతాతదేశికాచార్యులుగారిచే విరచితము. ఇందార్యామానసబోధస్తవము ద్రవిడాగమస్తవము కాషాయాష్టకము త్రిదండవింశతి శ్రీభూవరాహస్తవము శ్రీకృష్ణమేఘస్తవము శ్రీమందస్మితస్తుతి శ్రీమన్నృసింహప్రపత్తి యుపాయస్తవము మొదలగునవి కలవు. ఇవియన్నియు గ్రంథకర్త శాస్త్రీయమైన సాహిత్యమును జాటుచుఁ జాలఁ బ్రౌఢములును స్తవనీయములును నైయున్నయవి. అందు మానసబోధస్తవము 109 ఆర్యావృత్తములతో మానసబోధరూపముగా నుండినస్తుతి. మనసు మన కధీనముగాక యనేకగతుల నరుగునది యగుట ననేకు లద్దాని నిందించుచు నీతిని బోధింతురు. ఇందు నిందింపక

శ్లో. అధ్యాస్తే యత్ప్రణయాదపి మోక్తుమనాస్స్వయం శ్రియోపి పతిః
తస్మై మమాపి మనసే తమోనులీఢాయ నిత్యమస్తు నమః.

అని ప్రథమశ్లోకమే ప్రణామపూర్వకముగా నారబ్ధము. ఇట్లే యీమానసబోధస్తవము.

శ్లో. బంధాయ విమోక్షాయ చ భవస్య హి యాతనుభృతాంత్వమేవైకం
దుఃఖాయాపి సుఖాయ ప్రతీపవృత్త్యాత్మనోనుకూలతయా.
అలమనుభూతై రసుఖై రాభాససుఖై రజస్ర మనువృత్తైః
హృదయ! శుభాశ్రయ యోగాద్యతస్వ శాశ్వతసుఖాయ సులభాయ.
పదసరసీరుహయుగళం ప్రస్మరనఖరాంశు సురనదీపూరే
స్నపహారే రథ్యాస్య చిరం హంసలలామేవ విహర మానస! మే.

మొదలగు నార్యలతో హృదయంగమమై యున్నయది. ఇట్లే యీస్తోత్రములన్నియును భక్తులకెల్లరకును బఠనీయములై పరంగుచున్నయవి.

శ్రీమన్నృసింహ ప్రపత్తిలోని శ్లోకత్రయ మీ దిగువఁ జూపంబడియెడిని.

హంతాపరాధరుషితౌ క్వచిదాశ్రితానాం
యావుద్యతౌ నిరసనే వ్యవిమోచనీయౌ
తావేవ వత్సలతయా హృదయంగమౌ నః
శ్రీమన్నృసింహచరణౌ శరణం ప్రపద్యే.
నేత్రోత్పలైః ప్రతిపదం సురసుందరీణాం
అభ్యర్చితౌ ప్రణతకామదుఘౌ త్రిలోక్యాం
ప్రత్యర్థినామపి మనోజ్ఞతయా విమోచ్యౌ
శ్రీమన్నృసింహ చరణౌ శరణం ప్రపద్యే.
సంస్పర్శనేన కుచయోః కమలాలయాయాః
సంక్రాంతపాటలిమ రంజితమానసాబ్జౌ
ఆత్మీయసంస్థితివశా దనపాయినౌ నః
శ్రీమన్నృసింహచరణౌ శరణం ప్రపద్యే.

—♦ ధర్మవిప్లవము. ♦—

విక్టోరియా రాణిగారు మత సంబంధమయిన విషయములలో మేము జోక్యము కలుగఁజేసికొనమని చేసిన వాగ్దాన మందఱికిని దెలిసియేయున్నది. పాలకులు న్యాయశాఖ నేర్పఱచి ధర్మశాస్త్రముల ననుసరించి హిందూ, మహమ్మదీయులకుఁ బ్రత్యేకించి న్యాయాన్యాయముల నిర్ణయించుటయు విదితమే. ఇందువలన ధర్మసంరక్షణ పరిపాలనమందుఁగలదనుట నిర్వివాదము. ప్రస్తుతము సంస్కర్తలు కోరు

వానిలోఁ జాలవఱకు వర్ణభేదములేని విందులు, రజస్వలా వివాహములు, స్త్రీ పునర్వివాహములు తుదకచ్చటచ్చట వర్ణాంతర వివాహములును సవర్ణులలో నిష్టమున్నవారు పాటించుచున్న విషయము సర్వత్ర తెలిసినదే, ఇంక నీవిషయములోఁ జట్టమెందులకుఁ గావలసివచ్చినదో విచారణీయము. మతధర్మములకు వ్యతిరిక్తముగా ప్రవర్తించినవారితో నసంఖ్యాకులగు మిగతవారు సపంక్తిభోజనము మున్నగు వానిలో దూరస్థులగుచున్నారనియు నందువలనఁ దపకు నగౌరవము వాటిల్లుచున్నదనియు భావించి యిట్టిభేదము లేకుండునటుల రాజశాసనము ద్వారమున నిర్బంధించుటకన్న వారికి వేఱు పురుషార్థము లేదన్న విషయము వేఱుగఁ జెప్పవలయునా? హిందూ మహమ్మదీయులలో మత కక్షలవలనఁ గలుగున శాంతి నరికట్టుటకు శ్రమచేయుచున్న ప్రభుత్వము వారి కనుభవవేద్యమే. అష్టమ యెడ్వర్డు ప్రభువుగారిని మహారాజపదవినుండి తొలఁగించి పూర్వాచారములను బట్టుదలతోఁ బాటించిన యాంగ్లప్రభుత్వము వారును జక్రవర్తిగారును హిందువుల మతాచారములుకూడ నటువలెనే పాటించుట కర్తవ్యము. "రాజా రాష్ట్రకృతం పాపం" తమ రాష్ట్రమందు జరుగుచున్న దోషములకు రాజుత్తరవాదియని ధర్మసూత్రము గలదు. సంస్కారులయిన శాసనసభ్యులు పరస్పర సాహాయ్యముతో మత సాంఘిక విషయములలో మార్పులను గలిగించు శాసనములు గావించు టతిసాహసము. సృష్ట్యాదినుండి వచ్చుచున్న వర్ణాశ్రమాచారములను భంగపఱచుట యెట్టిన్యాయమో గమనింపవలసియున్నది. ప్రస్తుతశాసనసభలో మెజారిటీయే ప్రధానమని శాసించిన ధర్మవిప్లవమునకును, గక్షలకును, గల్లోలములకును గారణమగును.

—♦ మహచ్ఛబ్దవిచారము ♦—

(శతావధాని, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు).

"మహచ్చిత్రం కృతం, మహత్కార్యం కృతం" అంటూ సంస్కృతనాటకాలలో అక్కడక్కడ ఉంటే దాన్ని తెలిఁగించేవారు కొందఱు సంస్కృతప్రవేశం బాగా లేనివారు —

"మహచ్చిత్రము చేయఁబడ్డది, మహత్కార్యము చేయఁబడ్డది" అంటూ తెలిఁగించి ఉన్నారు. "నాకు కౌముది బాగా వచ్చును, శాస్త్రార్థం చేయమంటే చేస్తాను" అనేవారే "మహ" చ్ఛబ్దాన్నిగూర్చి యెన్నో స్థలాలలో పొరఁబడి వున్నప్పుడు తదితరులు పొరఁబడడంలో విశేషం వుండదు. అయితే సంస్కృతంలో అలా ఉంది గదా! అంటూ స్థూలదృష్టికి శంక కలగవచ్చు. సంస్కృతఁలో —

మహత్ – చిత్రం. మహత్ – కార్యం, అని వ్యస్తం కాని, సమస్తం కాదు. తెలుఁగులోకి వస్తే సమస్తపదం కాక తప్పదు. అయితే ఆకారాదేశం తప్పదు. యీలాటిరహస్యాలవల్ల కవికి సంస్కృతములో యేమాత్రం ప్రజ్ఞ ఉందో తేలుతుంది. గాని, యితరాలవల్ల తేలదు.

ఆత్మశబ్దానికి మనస్సు అనే అర్థం చెప్పకొన్నప్పుడు, 'ఆత్మ' అని అవుతుంది గదా! అని – అధ్యాత్మశబ్దానికి – "అధ్యాత్మ" అని ప్రయోగించారనుకోండి.

ఇది సందర్భం తెలియక ప్రయోగించినట్లు — స్పష్టపరుస్తుంది. మధ్యశబ్దంవలె దీన్ని చరిత్రాదుల్లో పఠిస్తామంటేకూడా ఏతత్సజాతీయాలు దానిలో లేకపోవడంచేత అంత యుక్తియుక్తంగా వుండదు. మఱివకటి "న్యూనాధికముల్" "న్యూనత్వము, అధికత్వము" అనే అర్థమందు పైప్రయోగం చింత్యం. 'జన్మజన్మములు' ఇక్కడ యేకశేష దుర్వారం. అయినప్పటికి సంస్కృతకవిత్వం గాదు. కనుక తెలుఁగులో నిట్టివ్యవహార ముఁడడంవల్ల ప్రయోగించుకొన్నా మంటే తప్ప గత్యంతరం లేదు. "నదీనదములు, విటీవిటులు, దాసదాసీజనములు" లోనైనవి సంస్కృతకవిత్వంలో నున్నా కనపడతాయి. తెలుఁగులో చెప్పనక్కఱలేదు. యిక్కడకూడా యేకశేష దుర్వారమే. అతి కష్టంమీఁద యేదో త్రోవత్రొక్కి సమాధానం చెప్పుకోవలసి వుంటుంది

"సుభగ, భగవత్, భగినీ" ఇత్యాదులయందున్న భగశబ్ద మర్థవత్తయికూడా అపార్థాన్ని యివ్వదని లాక్షణికుల శాసనం.

మార్గవాచక పర్యాయాలలో వున్న—అధ్వన్ శబ్దానికి, అధ్వానం, అనే రూపం, ద్వితీయావిభక్తిలోవుంది గాని తత్సమంలో ద్వితీయాంత ప్రాతిపదికమయే తెగలో యిది చేరదు. 'అధ్వాన' అనేఅకారాంతశబ్దమున్నట్లు -శ-ర-లో వుంది గాని దానికి అర్థం "అమార్గము" అనే వ్రాయడంచేత - "మహాదధ్వానము" అనే ప్రయోగాన్ని అదిన్నీ సాధించ నేరదు. కాఁబట్టి దీన్నిబట్టి "అధ్వానము" అనే దాన్ని, అధ్వము అనే అర్థమందు వాడఁగూడ దని తెల్పుతూ వున్నాను. ఈ "అధ్వాన"ప్రయోగము భర్తృశబ్దమునకు - "భర్తారుఁడు"వంటిది అని తెలిసికోవలెను. యీ "భర్తారుఁడు" నరసరావుపేట ప్రాంతంలో వాడఁగా విన్నాను. దవీయశ్శబ్దము సకారాంతము గాని అకారాంతము గాదు. అందు చేత, 'దవీయః పదము' అని వుండడం యుక్తం.

"వృక్షవిచరన్మత్తాన్యభృచ్ఛారికా" అంటూ వక పెద్దసమాసంలో "కోకిలలు" అనేఅర్థం వస్తుందనుకొని, "అన్యభృత్" అనే పదాన్ని ప్రయోగించి వున్నారు. కోకిలకు - పరభృత - అనే పేరు వుంది. అది యెందుకు వచ్చిందంటే? పర=ఇతర జంతువులైన కాకులచేత, భృత=భరింపఁబడేది, అనఁగా కోకిల గ్రుడ్లు పెట్టడమే కాని పిల్లలను చేయడం చేతకానిది కనక అ గ్రుడ్లను కాకిగూఁటిలో పడవేస్తుం దనిన్నీ తరువాత కాకి అవి తనగ్రుడ్లే అనుకొని పిల్లలుగా చేస్తుం దనిన్నీ చెప్పుకొనేమాటలు అందఱూ యెఱిఁగినవే. కోకిలకు సంబంధించిన పదప్రసక్తి వచ్చింది కనక యిక్కడే దాని పెంపుడుతల్లి—కాకినిగూర్చికూడా కొన్నిమాటలు వ్రాస్తాను. యీ కాకి చాలాకాలం బ్రతుకుతుందనే కారణంచేత—"చిరజీవి" అంటూ దీన్ని కవులు వాడుతూ ఉంటారు. "డిద్ధ బిద్ధా" దిశబ్దాలవలె కాక యీ చిరజీవిపదము వ్యుత్పత్త్యర్థం కలదిగా ఉంది. మనము మనపిల్లలు తుమ్మినప్పుడు, 'చిరంజీవ' అనడం కలదు. మనం మనకన్న చిన్నలకు ఉత్తరం వ్రాసేటప్పుడు, "చిరంజీవి" పదాన్ని వాడతాం గాని సున్నలేని "చిరజీవి" పదాన్ని వాడము. ఎందు చేత? ఆపదానికి రూఢివల్ల కాకి అర్థం అవుతుంది గనుక. అమరంలో, "చిరజీవీ

నైకదృష్టిః" అని వాడి యున్నాడు. "మార్కండేయుండనుముని చిరజీవి యగుచు" అన్నప్రయోగము కొంత చింత్యం కాకపోదు.

దేవాలయప్రవేశపుబిల్లు పంచములకే యనర్థదాయకము.

(గొర్తి పళ్ళయ్యశర్మగారు.)

ఈమధ్య రాజోలుతాలూకా యంతర్వేది ప్రాంతగ్రామమం దొకదేవాలయమం దొకరోజునఁ బంచములు రమారమి 100 మందివఱకు హఠాత్తుగా దేవాలయమునొద్దకు వచ్చి యర్చకుని భయపెట్టి తలుపుతీయించి యందుఁబ్రవేశించి భజనకీర్తనలు సల్పిరఁట. అప్రకారము సాయంకాలమువఱకు జరిపి యర్చకుఁడు పారిపోఁగాఁ దమపంచమార్చకునిచేఁ దాము తెచ్చిన చలిమిడి నైవేద్యముచేయించి యాప్రసాదము తమయిండ్లకుఁ దీసికొనిపోయిరఁట వారాప్రసాదము నారాత్రియో మఱునాఁడో యనుభవించిరికాఁబోలు. 4, 5 రోజులకు వరుసగా 40, 50 మందివఱకు మృతినొందుచునేయుండిరఁట. మఱికొంతమంది యిప్పటికిని మంచములమీఁదనె యుండిరఁట. ఈసంగతి విన్నవారికిఁ జాలనాశ్చర్యముగా నుండుచున్నది డాక్టర్లు వచ్చి మృతినొందఁగా మిగిలినవారికిఁ జికిత్సచేయుచున్నారఁట. చికిత్సచేయుచున్నప్పటికిఁ గొంతమంది మృతినొందిరఁట. చాలమంది యీసంగతి విన్నంత నీశ్వరమహిమగా నెంచుచున్నారు. జగత్తు పుట్టినదాదిగ నింతవఱకే యేయుగమందుఁ బంచములు దేవాలయమందుఁ బ్రవేశించినట్లు మనము వినియుండలేదు. ఏశాస్త్రమందుఁగాని యేపురాణమందుఁగాని చూచినట్లయినను నేపండితులుఁ జెప్పియుండనులేదు. పంచములు వృద్ధిలోనికి రావలెనన్నను బ్రాముఖ్యము పొందవలెనన్నను నీదేవాలయమందుఁ బ్రవేశించినంతమాత్రాన వచ్చునా? ఇది మార్గమా! వారి కౌన్నత్యము కావలెనన్న విద్యాభ్యాసము చేసికొనవలెను. ఉద్యోగములను జేయవలెను. వర్తకము వ్యవసాయము చేసికొనవలెను. అప్పుడు వారికోరికలు సఫలత నొందఁగలవు. లేదా పూర్వాచారపద్ధతిప్రకారము తమకంటెఁబైవర్ణములవారికి సేవఁజేయుచు జార చోరత్వముల విడనాడి సత్యసంధులై సర్వకాలములయందు భగవన్నామస్మరణఁజేయుచుండిన నిహజన్మమందు సుఖము ననుభవింపుచు నంత్యావస్థయందు మోక్షము పొందఁగలరు. అమాటలనె శాస్త్రమును బోధించుచున్నది. "స్త్రీ శూద్రాణాం సదా గోవింద కీర్తనమ్" అని యీ కాలమెంతకలికాలమైనప్పటికి నింతదుష్కార్యమునకు భగవంతుఁడోర్చుకొనునా? అటులయిన నీవర్ణాశ్రమ విభాగ మేలచేయవలెను? కుడిచెయ్యి యెడమచేయియని విభాగించు టేల? కలికాలము గనుక నెడమచేతితోఁజేయుపనినహితము కుడిచేతితోఁ జేసికోవచ్చునని కాఁబోలు! బ్రాహ్మణులు సహిత మధర్మాచరణఁజేయువారు తత్ఫలము ననుభవించఁగలరు. కొంతమంది తత్ఫలము ననుభవించుచున్నను నీపాపఫలము గానట్లుగా నెంచుకొనుచుండిరి. కాని "అత్యుత్కటైః పుణ్యపాపై రిహైవ ఫలమశ్నుతే" అను శాస్త్రోక్తి కలదు దేవాలయమందుఁ బ్రవేశించినపంచములును మహాపాప మాచరించిన ఫలమును వెంటనే పొందినట్లుగా నూహింపఁబడుచున్నది. "మాకురు ధనజనయౌవనగర్వం హరతి నిమేషా త్కాల స్సర్వం"

ప్రతివ్యక్తి తనకు ధనమున్నదనిగాని జనస్తోమము గలదనిగాని బలదర్పములు గలవనిగాని గర్వపడఁగూడదు. అటుల గర్వపడిసంచరించిన శీఘ్రకాలములోనె కాలము గర్వభంగము చేయఁగలదని యర్థము. కనుక మానవునికిఁ బశుపక్ష్యాదులకుఁగల తారతమ్యమేమి; పశువుల కిది పుణ్యము నిదిపాపము నిదిమంచి యిదిచెడ్డ యనెడి యుక్తాయుక్తజ్ఞానముండనేరదు. ఇప్పటికాలమందుఁ జాలమంది పశువులమాదిరిగనే యుక్తాయుక్తవివేకములేక తమకు విధించిన శాస్త్రధర్మముల నుల్లంఘించి ప్రవర్తింపుచుండిరి. ఇందుచేఁదప్పక ఘోరనరకముల ననుభవించఁగలరు. ఇహజన్మమందనేక విధములగు కష్ట దుఃఖముల నొందఁగలరు. కాఁబట్టి సమస్త వర్ణాశ్రమవాసులారా! మీమీ వర్ణాశ్రమములకు శాస్త్రమందు బోధించినరీతిని పెద్దలయాచారపద్ధతిని విడనాడకుఁడు. స్వల్పసుఖముల కాశనొంది యధర్మప్రవర్తన మాచరింపకుఁడు. అట్లాచరించిన ననేకకష్టముల పాలగుదురని మున్ముమ్మాటికి నిశ్చయముగా నమ్ముఁడు.

—♦ ఈతిబాధలు. ♦—

(శతావధాని, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు.)

అంతగా వేదశాస్త్రాలు'సన్నా పోక బొత్తిగా వేదస్తమంటూ అన్నింటినీ వదులుకోక వకమాదిరిగా కాలక్షేపం చేసుకుపోతే మన ఆర్యమతం పంచసూనాదోషాలతో కాలక్షేపం జరగనిస్తుంది. యీదోషాలకుకూడా మనవారు వప్పనేలేదు. యీ దోషాలేవో కొంచెం వివరిస్తాను. "సూనా" అంటే హింస. అది ప్రతిగృహస్థుకున్నూ నాంతరీయకతయా అంటే యెంత చేయకుండా వుందా మనుకున్నప్పంటికీ తప్పని విధిగా అయిదింటి ద్వారా సంక్రమించి తీరుతుం దనిన్నీ, ఆపాపాన్నికూడా యే రోజుకారోజు పోఁగొట్టుకోవాలనిన్నీ, ఆదోషనివృత్తికై వైశ్వదేవం అనేకర్మని విధించారు. దీన్ని చేసినవారినే పాకయాజిబిరుదంతో వైదికులు వ్యవహరిస్తారు. యిది చేయనిది బ్రాహ్మణీకం వుండనేవుండదు. ఆ అయిదింటిలోను వకటి 'చుల్లీ' అంటే పొయి, దీనిద్వారా యెన్నో పురుగులు చస్తాయి. రెండు 'పేషణి' బహుశః తిరగలి సన్నికల్లు రుబ్బురోలు వగయిరాలు అవుతాయి. వీట్లద్వారా కొన్నిసూక్ష్మజంతువులు చస్తూ వుంటాయి. అట్టే గ్రంథం పెంచటం యెందుకు? మనిషి నడిచేటప్పుడు దారిలోనున్నూ, వర్షాకాలంలో పొలాల్లో నేరేడిచెట్ల సమీపంలో వుండే గట్లమీఁద ప్రయాణం చేస్తూవుంటే కోటానకోట్లు కండచీమలు భూమి యీనినట్లు పరమాణువంత మేరకూడా యెడంలేకుండా వుంటాయి. అక్కడ నడుస్తూవుంటే యెన్నో చస్తాయి. అక్కడికీ స్వేదజాలుగా వుండే నల్లులూ పేలూ వగైరాలతో సంబంధంలేకుండా శిష్టులు పిల్లజుట్లు వగయిరా లేర్పరచుకున్నారు. కాని భార్యలకు శిరోజాలుండక తప్పకపోవటంచేత తద్ద్వారాగా వచ్చేపాతకాన్నికూడ చెటిసగం తాము భరింపవలసివుంటుంది. కనుక మొత్తం వీట్లనన్నిటినీ కల్పి వైశ్వదేవమనే పుణ్యకర్మద్వారాగా నివర్తింపచేసుకొన్నట్టయిం దనుకోవాలి. బాహ్యదృష్ట్యా వైశ్వదేవానికి ఫలితం యిదే అయినప్పటికి అంతర్దృష్టినిపట్టి చూస్తే యేజంతువునకుగాని

హానిలేకుండా వర్తించరా! పెళ్లికొడుకా? అని ప్రతిమనిషికిన్నీ భగవంతుఁడు విధించినట్టు తేలుతుంది. యిట్టిస్థితిలో ప్రస్తుతం పీడిస్తూవున్న యెలకలకున్నూ పందికొక్కులకున్నూ యేం చేయడానికిన్నీ మనమతరీత్యా వుపాయాంతరం కనపడడం లేదు. యధేష్టంగా తిని మదించి రాత్రి తెల్లవార్లూ పందికొక్కులు చేసే అల్లరికి పరిమితే కనపడడంలేదు. పందికొక్కును చంపితే వైజన్మానికి వుబ్బసం తగులుకుంటుందంటూ పెద్దలు చెప్తారు. దానికి తథ్యంగా యీమధ్య వొక సంపన్నగృహస్థు కొన్ని పందికొక్కులను విధిలేక చారవచేసి చంపించి, చంపించిన కొద్దిరోజుల్లోనే లేదు లేదన్నంతపనిన్నీ జబ్బుపడి భగవదనుగ్రహంవల్ల మనుష్యలోకంలోకి యిప్పుడిప్పుడే వస్తూవస్తూ వుండడం చూస్తే, వాట్లఅధికారం సాగకుండా యేదో వుపాయం చూచుకోవలసిందేకాని వాటిజోలికి వెళ్ళడానికి లేశమున్నూ మనకు అధికారం వున్నట్టే బొత్తిగా కనపడదు. వుపాయ మల్లా కిటికీలకు గాలి తక్కువవస్తే వచ్చిందని చెప్పి యేయినపతీఁగెలో బెత్తాయించుకోవడం వగైరా. యీ బాధ అందరికీ వుండేదే. దీన్నిగూర్చి యింతగా వ్రాయడం లోకజ్ఞానశూన్యత్వానికి గుఱు తనుకోవడానికి తప్ప మఱొకందుకు కాదని కొందరంటారని నేను యెఱిఁగిన్నీ తీరికూర్చుని దీన్ని వ్రాశాను. దీనివల్ల నేను నేర్చుకున్నపాఠ మేమిటంటే? ఆర్యమతంకంటే ఉత్తమమైన మతమయితే లేదుగాని ఆమతంలోవుండి ఆమతధర్మాలు నెఱవేర్చుకోవాలంటే చాలాదుస్తరం. ఆ చేదస్తంలో వుండేవాణ్ణి. అంతోయింతో జ్ఞానంవుండే మనుష్యుల మాటల్లా వుండఁగా జ్ఞానంలేని తిర్యగ్జంతువులుకూడా లోఁకువచేసి బాధిస్తా యనేదియ్యేవే. నిత్యమున్నూ జంతుహింస చేస్తేనేకాని పొట్టగడవనివాళ్లెందఱో వున్నారు. వాళ్ళందఱూ పిల్లా జెల్లా నోసతోఁటలాగ వృద్ధిగానే వుంటారు. యేం కర్మమో? యెన్నఁడూ చేయనివాళ్ళు కనక యెప్పుడేనా ఆఖరికి యేతేలునో యేపామునో చంపడమంటూ తటస్థిస్తే అది వాళ్ళకి యెల్లప్పుడూ మనస్సును పట్టి పీడిస్తూనే వుంటుంది. మొత్తం భారతాది గ్రంథాలన్నీ యీవుద్దేశంతోనే చాలావఱకు ప్రవర్తించాయి. కానిసర్పయాగాది క్రూరకృత్యాలు మాత్రం కోపం తీర్చుకొనే అభిప్రాయంతో ఆరంభించడం మాత్రం సూచిస్తూవచ్చాయి. దుష్టజంతుమారణంవల్ల లోకానికి యెంతో వుపకారం వుందని యెఱిఁగిన్నీ మహర్షులు ఆమారణంవల్ల ఆ జాతి అసలేలాగా నశించదని యెఱిఁగి వుండడంచేత కాఁబోలు; - వృథాగా యీ హింసారూపమైన పాపాన్ని యీమహారాజు చేస్తూవుంటే చూస్తూ వూరుకోవడమెందుకని "ఓంశాంతి శ్శాంతి శ్శాంతిః" చెప్తూ వచ్చారు. చాలా దయాశాలిగా వుండే శ్రీనూజివీటి రామచంద్రప్పారావుగారు వకరోజున ప్రసంగవశాత్తూ అహింసా తత్త్వాన్నిగూర్చి మాట్లాడుతూ అన్నారుగదా! మాంసభక్షణం హింసామూలకమవడంచేత పూర్తిగా వర్జించతగ్గదే కాని ఆపద్ధతిని యీజంతువులు అందులో చతుష్పాత్తులలో మేఁకలూ గొఱ్ఱెలూ ద్విపాత్తులలో అందులో పక్షులలో ముఖ్యంగా కోళ్లు యివి యేమికావలసి వుంటుందో! బోధపడ రాదన్నారు. స్థూలదృష్టిని చూస్తే అలాగే కనపడుతుంది. రోజువక్కంటికి ఆసేతు హిమాచలపర్యంతం

లో తెగుతూవున్న మేఁకలూ గొఱ్ఱెలూ కోట్లసంఖ్యను మించుతాయనడంలో అతిశయోక్తి లవమున్నా వుండదుకదా! కోడిగుడ్లను లెక్కపెట్టడం భూరేణువులని లెక్కించడం వంటిదే. యీలా మనుష్యులకోసం యివి హతమౌతూవున్న మూలచ్ఛేదం కాక సముద్రంలో తరంగాలలాగ మామూలు వృద్ధిలోనే వుండడంచూస్తే వీట్లని గుఱించిన భగవదుద్దేశ మేలాటిదో బొత్తిగా మనస్సుకు అందడమే లేదు. యిన్ని జీవరాసులను యీలా చంపుకుతింటూవున్న మాంసభక్షకులను యెవళ్ళు గాని నిందించినట్టే కనపడదు గాని వేదవిహితమైన కర్మలు చెడిపోతాయనేభయం తోటి యజ్ఞంలో పరిమితంగా ఆలభనంచేసే మేఁకలనుగూర్చి చింతించేవారు పలువురు కనపడతారు. యజ్ఞానికి అనల్ల మేఁకనో తెల్ల మేఁకనో కర్మపరులు తీసుకోవడం మానినంతలో దానికి బలవన్మృతి తప్పుతుందేమో అంటే? "తిరుమల తాతాచార్లగారి ముద్ర" లాగ యేలాగ తప్పదు. యీవేళ సోమయాజులుగారి గండం తప్పినా మఱునాఁటి బిస్మిల్లామంత్రపాఠకుల గండం తప్పుతుందా! అయితే వకటి మాత్రం వుంది. అహింసాపరుల మనిన్నీ భూతదయాపరులమనిన్నీ చెపుతూవుండే వారిని యెవరేనా యేమేనా అనడానికి అవకాశం ఉంటుందిగాని యితరులని యెవరేమంటారు? అంతేనేకాని వీరియందు వుండే ద్వేషభావంచేత కాదని విస్పష్టమే. పూర్వకాలంలో జంతుహింస లేదని చెప్పఁజాలంగాని యిప్పటి మాదిరిగా తదర్థమై శాలానిర్మాణాలు వున్నట్లు గ్రంథదృష్టాంతాలు కనపడవు. భారతంల్లో ధర్మవ్యాధుఁడు చెప్పినమాటలుకూడా యీ వూహనే బలపఱుస్తాయి. మహమ్మదీయప్రభుత్వం వచ్చాకైనా శాలానిర్మాణపద్ధతి వున్నట్టు తోఁచదు. కాని పూర్వంకంటే హింస కొంత తీవ్రరూపం తాల్చిందంటే వొప్పనివా రుండరు. ఆ రాజ్యంలోనే గోవధ బాగా విస్తరించివుంటుంది. సందేహం లేదు. అంతకుపూర్వం నరమేధంతోపాటుగా బహు విరళంగా గోమేధాలుకూడా వుంటే వుండేవేమో కాని మహమ్మదీయులు గోమేధాలు అజామేధాలతోపాటుగానే సాగించారు. యిటీవల వీట్లకోస మంటూ శాలానిర్మాణాలుకూడా యూరోపియను ప్రభుత్వంలో అయాయి. ఆమధ్య నూజివీటిలో కాఁబోలును పందులను చంపడానికంటూ యూనియన్ బోర్డువారు శాలానిర్మాణానికి ప్రారంభిస్తారని తెలిసి మహమ్మదీయులు గోవధకుకూడా అట్టి సదుపాయం కావాలని ఆందోళనానికి మొదలుపెయడం వఱకున్నూ జరిగింది. బోర్డు ప్రెసిడెంటు ఆజమీందారులలోనే యెవరో వుండి యేలాగో ఆమాట తమకు దక్కవలసివస్తుందేమోనని చాలా భయపడడంవఱకున్నూ మాత్రం నే నెఱుఁగుదును. తరువాత యేం జరిగిందో నాకు తెలియదు. నిన్న మొన్న లాహోరుసిటీలోనే కాఁబోలును యీ పుణ్యకార్యానికి శంకుస్థాపన గవర్నమెంటువారే చేసి గృహనిర్మాణం జరిగిస్తూవుండఁగా ఆ ప్రాంతపు హిందువులు ముఱ్ఱో మొఱ్ఱో అని లబలబలాడి ఆందోళనచేసి విన్నపాలు పంపుకోఁగా పంపుకోఁగా ప్రజాద్వేషాని కిది కారణమవుతుంది కాఁబోలునని యెంచో, లేక వీళ్ళ మతానికి వ్యతిరేకమయిన కార్యం వీళ్ళదేశంలోనే చేయడ మెందుకనో అంతటితో ఆఁపినా రని యేదో పత్రికలలో చదివినట్లు జ్ఞాపకం. యీవిధంగా జరుగుతూవున్న నిర్మాణాన్ని ఆఁపడం

వల్ల వచ్చిననష్టమే 50 లక్షల రూపాయీలనికూడా ఆపత్రికే వ్రాసింది. నిజంగా అది సంపూర్తి కౌశలసివస్తే లక్షలతో తేలేది కాక కోట్లతో తేలే దని నే ననుకున్నాను.

“నీ భాగ్యమ్ము లీపాటి కా కసురేంద్రుండు పదత్రయం బడుగ నీయల్పమ్ము నీ నేర్చునే?” అన్నట్టు సూర్యోదయ సూర్యాస్తమయాలే యెఱుఁగని మహాసామ్రాజ్యానికి యెంతసొమ్మైతేమాత్రం లక్ష్యమేమిటి? మాంసభక్షణ చేయడం లేదని పూర్వపు రాజుల ప్రభుత్వాన్నిగూర్చి చెప్పడానికయితే ఆధారాలు లేవుగాని యీలాటివిషయాల కీలాటి సదుపాయాలని యింతింత ద్రవ్యం వెచ్చించి కల్పించినట్లు దృష్టాంతా లేవిన్నీ లేవు. దిక్కుమాలిన ప్రారబ్ధం బ్రాహ్మణముండాకొడుకులు గట్టిగా నోరారా యేడవడానిక్కూడా వీలులేకుండా యెక్కడో వకటో రెండో వాక్యాలు అతిథిపూజకు లేఁగ దూడను కోసిపెట్టవలసిందని వుండడం వకటిన్నీ, గోమేధం అంటూ వకటిన్నీ వచ్చి అడ్డుతగులుతూ వున్నాయి. నరమేధప్రయుక్తమంత్రాలే కనపడతాయి గాని జరిగినట్టు లేదు. హరిశ్చంద్రుఁడు చేస్తూవుండఁగా విశ్వామిత్రుఁడు ఆఁపుచేసినట్లే పురాణగాథ చెపుతూవుంది. వేదమున్నూ దీనికి వ్యతిరేకించదు. యింకోచోట తనపుత్రుణ్ణి వొకణ్ణి చంపి యాగంచేస్తే నూటుగురు కొడుకులు కలుగుతా రని పురోహితుఁడు చెప్పినట్లున్నూ వొకరాజు ఆలాటి యాగాన్ని చేసినట్లున్నూ భారతంలో కనపడుతుంది. అది నరమేధం అనిపించుకుంటుందో? లేదో నిర్ణయించ తగ్గశక్తి నాకు లేదుగాని ఆవుపాయం చెప్పిన పురోహితుఁడికి సంపూర్ణ ప్రాయశ్చిత్తం పరలోకంలో జరిగినట్టుకూడా ఆ భారతంలోనే వుంది. అయితే ఆయాగకర్తకు మాత్రం పుణ్యలోకమే వచ్చినట్టున్నూ తుదకు ఆయాగకర్త తన పురోహితుఁడిక్కూడా శిఫారసుచేసి ఆనరకబాధను తప్పించినట్టున్నూ దానిలోనే కనపడుతుంది. యింతకన్న నరమేధాలకు వుదాహరణాలు కనిపించవు. పూర్వయుగంలో రంతిదేవుఁడు కాఁబోలును గోమేధాలు యెన్నో చేసినట్లు కనపడుతుంది. కాని అందులో గోవులు స్వయంగా వెళ్లి పుణ్యలోకావాప్తికొఱకు ఆమహారాజును ప్రార్థిస్తే ఆయన అంగీకరించినట్టు కనపడుతుంది. అంతేనే కాని బలవంతబ్రాహ్మణార్థ ప్రకరణం లేశమున్నూ లేదు. యీయుగంలో ఆగోమేధం జరగడానికి వల్లకాదని మహర్షు లేలాగో—

“కలౌ పంచ విసర్జయేత్”

అని పుణ్యం కట్టుకోవడమైతే జరిగింది గాని అయితే యేం లాభం? ఆ ధర్మశాస్త్రాలకు కట్టుఁబడని మహానుభావులు ఆరంతిదేవుణ్ణి మించిన యాగాలు చేస్తూవున్నారు. ఆ చర్మాలరాసులవల్ల బయలుదేఱిన నీరు మఱికినీరుగా వుండడానికి బదులు మహాపవిత్రమైన జలం కల నదిగా ప్రవహించినట్టు మన పురాణాల్లో వ్రాయఁబడి వుందిగాని యీ చర్మాల వర్తకులు కోటీశ్వర్లై యెంతో పేరు ప్రతిష్ఠలు గణించినట్టు మనకు ప్రత్యక్షదృష్టాంతమే కనపడుతూ వుంది - పురాణగాథలతోవ పురాణాలదీ మనతోవ మనదీగా వుండడంచేత ధర్మాధర్మనిర్ణయం చాలాదుర్ఘటంగా కనపడుతూవుంది — “సత్యంబ పల్కం బడున్” అనే

ప్రతిజ్ఞతో ముక్కుమూసుకొని జపతపాలతో కాలక్షేపం చేస్తూవుండే "తృణీకృత బ్రహ్మపురందరులు" మహర్షుల కేమంత కర్మం కాలిం దని అబద్ధాలు వ్రాసి లోకాన్ని మోసపుచ్చడానికి? నాన్ బ్రాహ్మిన్సులో కొన్ని తెగలవారు యిప్పుడు చెప్పేమాటలు చూస్తే "ఋషులేమో బ్రాహ్మణజాతికి సంబంధించిన వాళ్ళనిన్నీ, అందుచేత బ్రాహ్మణుల కనుకూలంగానున్నా తమకు అననుకూలంగానున్నా గ్రంథాలువ్రాసి తమకు మహాద్రోహం చేశా"రంటూ కనపడతాయి. కాని ఆఋషులలో కొందరు జన్మతః బ్రాహ్మణులు కానివారు. క్షేత్రతః బ్రాహ్మణులు కానివారుకూడా వున్నట్టు గ్రంథాలవల్లనే అవగత మవుతుంది. అట్టి వాళ్ళుకూడా తమకు వ్యతిరేకంగానే లిఖించివుంటారా? అనే ప్రశ్నకు జవాబు కనపడదు. మొట్టమొదట యీ వ్యాసం ప్రారంభించడమేమో! యీతిబాధలనుగూర్చి- ఆయీతిబాధలలో మొట్టమొదటిదానికి సంబంధించినవి వ్రాసి దీన్ని ముగిస్తాను.

మొత్తం యీతిబాధల్లో అతివృష్టి మొట్టమొదటి దన్నమాట. యీరోజుల్లో సన్న్యాసులుకూడా సంచారం చేయరు. యీతిబాధలు లేనిదేశమే నివాసయోగ్యమైనది. అట్టిది ప్రపంచకంలోకల్లా మనభరతఖండమే అని చెప్పుకుంటారు. అలాటి దేశంకూడా యితరదేశ సంపర్కంవల్ల యిప్పుడు యెన్నో యీతిబాధలకు కొత్తకొత్తరకాలకు స్థానభూతం కావలసివచ్చిందికదా! అని విచారం కలుగుతుంది. దీపం దగ్గిఱనుంచీ యిప్పుడు మనం పరదేశాలమీఁద ఆధారపడి జీవించవలసిన దుస్థితిలో వున్నాము. పంపు లున్నాయని నూతులు కప్పేసుకుంటూ వున్నచోట్లెన్నో కనపడతాయి. యేకారణంచేతేనా పంపు మరమ్మతుకు వస్తే అది సవరణ అయ్యేదాఁకా దాహానికి నీళ్లు సున్నా అన్నమాటేగదా! మోటార్లు సైకిళ్ళు కాలినడకకు స్వస్తి చెప్పాయి, మరబియ్యం దంపుడు బియ్యానికి కొక్కెట్టాయి,డబ్బాపాలు తల్లిపాలని తోసిరాజన్నాయి. యీలా వ్రాస్తే యెన్నిటినో వ్రాయాలి. పూర్తిగా జీవనం పరాధీనమైపోయింది. రాజకీయ విద్యలకు ధనాపేక్ష విధాయకమే అనుకుందాం స్వదేశవిద్యలకుకూడా దానితో సంబంధం కలిగింది. ఆ యీ సందర్భాలన్నీ పూర్వంకంటేకూడా యిప్పుడు ప్రపంచాన్ని యీతిబాధామయంగా చేసివేసినట్టు తోస్తుంది. విస్తరించినకొద్దీ యీవిషయం పెరుగుతూనే వుంటుంది. ప్రస్తుతస్థితిని బట్టి చూస్తే సంసారిజీవిత మంతా యీతిబాధలతోనే నిండివుంది. పట్నవాసంకంటె పూర్వం పల్లెటూరు కొంత యీతిబాధారహితంగావుండేది. యిప్పుడో అక్కడవుండే సదుపాయాలు పల్లెటూళ్లలో కనపడవుగాని అక్కడవుండే యీతిబాధలుమాత్రం కనపడతాయి. కొన్నివూళ్ళకి కోఁతులబాధ విశేషించి కనపడుతుంది. యీకోఁతులు తాటాకు కొంపలవాళ్ళకన్నా పెంకుడు కొంపలవాళ్ళని యెక్కువగా బాధిస్తాయి. కొన్ని వూళ్లవాళ్ళు వీట్లకు జంకి పెంకుటిళ్లు కట్టుకోవడమే మానుకున్నారు. యివి యెంత బాధపెట్టినాసరే యేదో బెదిరించడమే కాని వీట్లను చంపడానికి మనహిందువులలో యెవరున్నూ ఒప్పుకోరు. దీనిక్కారణం రామాయణకాలంలో యీజాతి శ్రీరాములవారికి చేసిన సాయమే అని తోస్తుంది. సుమారు యేడెనిమిదేళ్లనాఁడు మావూళ్లో వకకోఁతి ప్రవేశించి గృహస్థుల నందఱినీ ఆల్ల

కళ్లోలపెట్టి బొత్తిగా నిలవనిచ్చింది కాదు. కోఁతులు కుక్కలకు భయపడడం సర్వసామాన్యంగా కనపడుతుంది. ఆకోఁతి కుక్క అని లక్ష్యపెట్టేదికాదు సరికదా! వాట్లను పట్టుకొని చెంపకాయలు కొట్టేది. కోఁతిజాతి పగలేగాని రాత్రి చెట్టు దిగిరాదు. యీకోఁతి రాత్రికూడా సంచరించేది. యిద్దఱు ముగ్గురుంటే తప్ప మనుష్యులమీఁద తిరగఁబడేది, యెక్కడో వక పిల్లిపిల్లను సంపాదించి దాన్ని వకకాలుతో పట్టుకొని తక్కినమూఁడు కాళ్ళతోటీ రెండు మూఁడురోజులు ప్రతియింటిమీఁదనూ తిరుగుతూ వుండడంచూచి యిది చంటిపిల్లలి నెక్కడ యెత్తుకుపోయి యీలాగే తిప్పుతుందో అని గ్రామం గ్రామమంతా హడిలిపోయారు. తుదకు ఆపిల్లి పిల్ల దాని చేతులోనే చచ్చింది. చెప్పేదేమిటంటే ? యింత దుర్మార్గంగా వర్తించినప్పటికీ దాన్ని చంపడానికి యెవ్వరూ అంగీకరించలేదు. పట్టుకుని గోదావరి దాఁటిస్తే వాళ్లకు కొంత సొమ్మివ్వాలని గ్రామస్థులు యేర్పఱచుకున్నారు. యెవళ్లో వచ్చి అందుకు ప్రయత్నంచేస్తూ వచ్చారు కాని వాళ్లకున్నూ అది దొరికిందికాదు. పట్టుకోవడ మంటే మాటలా ! చెప్పేదేమిటంటే ? వానరజాతికూడా యించుమించు నరజాతికి దీటయిందే ; కాదు కాదు లాఘవంలో చాలా అతిశయిస్తుంది. దాన్ని పట్టుకోవలసివస్తే సుఖసుఖాల జరుగుతుందా ? దానిచేత గాయాలు పడి చాలామంది ఆసుపత్రిలో కట్లు కట్టించుకోవలసికూడా వచ్చింది. తరువాత యెవళ్ళో పట్టుకుంటా మన్నారు. యిఱవైయేదు రూపాయీలిమ్మన్నారు. దస్తుచేసి యిచ్చుకున్నాము. సకలచిక్కులూ పడి యేలాగయితే యేమి ప్రాణావశేషంగా వున్నప్పుడే పట్టుకున్నారు. కొవ్వూరు ప్రాంతంలో వదిలిపెట్టినట్టున్నూ తరువాత అది అక్కడ మరణించినట్టున్నూ విన్నాము. చెప్పేదేమిటంటే ? యెంతచిక్కువచ్చినా కోఁతినిగాని పందికొక్కునుగాని చంపడానికిగాని చంపించడానికిగాని మన హిందువులు సమ్మతించరు. మాంసభక్షకులు స్వహస్త పరహస్తాలచేత యేవో కొన్ని జంతువుల చావుకు సమ్మతించేవారే అయినా పయి జంతువుల విషయంలో బ్రాహ్మణులతో పాటువారే. యీ విషయంలో పాశ్చాత్యులే అయితే లేశమున్నూ వెనుదీయరు. వారికి దానివల్ల ప్రత్యవాయం కలిగినట్టున్నూ వినం. మనకయితే వెంటనే కలిగితీరుతుంది. దానితో పదిమందిన్నీ—"అదుగో ఆ పనిచేశాఁడు వెంటనే దృష్టాంతం కనపడిం"దంటారు—"యదనంతర"న్యాయాన్నిబట్టి అదినిన్నీ సరిగానే తోస్తుంది. పూర్వం యేదైనా ఘోరకృత్యం చేయవలసివస్తే యేకచ్ఛత్రాధిపత్యంగా యేలే చక్రవర్తికూడా జంకేవాఁడు. యిప్పుడో పేరుకు గుళ్ళో దేవుఁడులాగ ప్రభు వంటూ వున్నా పాలించేది దేశంలోవుండే నోరుగల ప్రముఖు లెవరో కొందఱుగా వుండడంచేత ప్రత్యవాయజనకమైన పనులుచేసినా వాట్లవల్ల వచ్చే ప్రత్యవాయాలు సంఘంమీఁద "తిలాః పాపం తలోపిడికెఁడు"గా గద్దకు పోతూవున్నాయి. కాని బాధిస్తూవున్నట్టు లేదు. యేదో ప్రసక్తానుప్రసక్తంగా యింత వ్రాశాను. గృహస్థుకు యీతిబాధారాహిత్యం చాలా అవసరం. అట్టి యీతిబాధలను కొన్నిటిని కనపఱచి వ్యాఖ్యానించివున్నాను.

మరేకొన్ని యింకా లేకపోలేదు. అవీ వ్రాస్తాను. భగవంతుఁడు సర్వదయాపరుఁడు అట్టి యీతిబాధలను తొలఁగించి తన ప్రజలకు సర్వవిధాలా సుఖప్రదాత అగుఁగాక అని ఆశీర్వచిస్తూ దీన్ని ముగిస్తున్నాను.

—♦ సనాతనుల కార్యవిధానము ♦—

(పెద్దిభట్ల వీరయ్యగారు, బి. ఏ., బి. ఎల్.)

కాంగ్రెసు లోకమాన్య తిలకుగారు జీవించియున్నంతవఱకుఁ గేవలము రాజకీయములతోఁ దప్ప మతసాంఘిక విషయములలో జోక్యము కలిగించుకొని యుండలేదు. ఇప్పటికిని గాంగ్రెసు మతతాటస్థ్యముగలిగియున్నటులఁ దీర్మానముగలదు. కాంగ్రెసునందనేకమతములవారు గలరు. కాంగ్రెసువారవలంబించుచున్న సంఘసంస్కరణపద్ధతి కేవలము హిందువులకుమాత్రము సంబంధించినదై యున్నది. దానితో మహమ్మదీయులకు సంబంధము లేదు. పై సంఘసంస్కరణపద్ధతి హిందువుల మతమునకు సంబంధము కలిగియుండనిపక్షమున వివాదమునకవకాశము లేదు. కాని పాశ్చాత్యవిద్యాధికులు కొందఱును వారి ననుసరించువారు కొందఱును పాశ్చాత్య మతసాంఘికవిధానముల ననుకరించుచుఁ దాము పూనిన సంఘసంస్కరణమునకును హిందూమతమునకు సంబంధము లేదనుచున్నారు. అట్టివారిలో గాంధీ జవహర్లాల్ మొదలగు ప్రముఖులు గలరు. మనదేశమునందలి పూర్వాచారసంప్రదాయములకుఁ గట్టువడిన సనాతనుల యభిప్రాయములోఁ బైసంస్కరణపద్ధతి హిందూమతమునకు విరుద్ధమని స్పష్టమగుచున్నది. అట్టివారిలో రాజా బహదరు కృష్ణమాచార్యులుగారు మొదలగువారు గలరు. అభిప్రాయభేదము పైవిషయమై కలదని కాంగ్రెసువారు నంగీకరించుచున్నారు. కాని తమ యభిప్రాయమే సరియైనదని సంస్కర్తలును సనాతనులును దలంచుచున్నారు. కాంగ్రెసువారి ప్రభ ప్రస్తుతము హెచ్చుగా నుండుటచేత మహమ్మదీయుల మతముతో వారు జోక్యము కలిగించుకొనకుండినను సనాతన హిందువులు మతవిషయమని యెంతచెప్పినను లక్ష్యముచేయక తాముచేయు సంస్కరణము మతవిషయముకాదని తాము నమ్ముటచేతఁ దామే న్యాయాధికారము వహించి సనాతనుల మాటలు పాటించక వారికిఁ బ్రతిబంధకమగు చట్టములను సంస్కరణములను సంఘమునఁ బ్రవేశింపఁజేయుచున్నారు. జవహర్లాలుగారును రాజగోపాలాచారిగారును సనాతనుల నేహిమాలయములకో పోయి తపస్సుచేసికొనవలసినదిగాఁ జెప్పుచున్నారు. కాంగ్రెసువారెంతకును దాముచేయు సంస్కరణములు మతమునకు సంబంధించినవి కావని తాము కాంగ్రెసు తీర్మానముప్రకారము మతముతో జోక్యము కలిగించుకొనుట లేదనియే వాదించుచున్నారు. కాంగ్రెసునందనేకమతములవారుండుటచేతను బ్రస్తుతసమస్య హిందూమతమునకుఁ జెందినదగుటచేతను గాంగ్రెసుమెంబర్లుగానున్న హిందువులెందఱో వీరిలో నొకవేళ నందఱును సంఘసంస్కర్తలేయని తలంచినను గాంగ్రెసుమెంబర్లుగాని హిందువులలో నెందఱు సనాతనులతో నేకీభవించుచున్నారో తెలిసికొనుట ముఖ్యకర్తవ్యము. ఆంగ్లేయవిద్య నభ్యసించినవారు పెక్కుండ్రు పట్టణములలో నుండుటచేత నచ్చటఁ గాంగ్రెసువారితో

నేకాభిప్రాయముగలవారి సంఖ్య కొంచెము హెచ్చుగా నుండినను బల్లెలలో మాత్రము సనాతనులతో నేకాభిప్రాయముగలవారి సంఖ్యయే చాల మిక్కుటముగ నుండఁగలదు. సనాతనులకు రాజకీయములందుఁ గాంగ్రెసువారితో నెట్టివివాదమును లేదు. సనాతన పక్షమువారిలోఁ బెక్కండ్రు రాజకీయములందుఁ బ్రవేశము లేక తటస్థముగానున్న యవకాశము తీసికొని కాంగ్రెసువారు విజృంభించి యనేకవిధముల సనాతనులగువారికి బాధకరములగు చట్టములను సంస్కరణములను గావించుచున్నారు. ఇఁక సనాతను లుపేక్షింప వీలులేదు. కాంగ్రెసువారే మంత్రులుగనున్నారు. సనాతనులయొక్క సంఖ్యాబలమును గుర్తెఱుఁగక కాంగ్రెసువారు గంతులువేయుచున్నారు. కాఁబట్టి సనాతనులను హిమాలయములకుఁ బోవలసినదిగా బోధించు జవహర్లాల్ గారు జనాభిప్రాయము తెలిసికొనుటకు వెనుకంజవేయరని తలంచుచున్నాను. ఇప్పుడు ముఖ్యముగా నాలయప్రవేశపుబిల్లునుగుఱించి శారదా చట్టమునుగుఱించి హిందువులలో బహుజనాభిప్రాయ మెటులున్నదో తెలిసికొనవలదా! కాఁబట్టి సనాతనపక్షమువారును గాంగ్రెసువారును ప్రజాభిప్రాయము తెలిసికొనుటకై ప్రయత్నించుట ముఖ్యవిధియై యున్నది. ఒకవైపున సనాతనులు కాంగ్రెసువారి సంస్కరణములు హిందూమతమునకు సంబంధించినవని ఘోషించుచుండ వ్యక్తిస్వాతంత్ర్యమున కడ్డుపడని కాంగ్రెసువారు దేశస్వాతంత్ర్యము నపేక్షించుచు స్వసంఘీయుల స్వాతంత్ర్యముల నరికట్టఁజూచుట విపరీతము కాదా! మహమ్మదీయులు భిన్నమతస్థులగుటచేత వారిమతమును గాంగ్రెసువా రెటులఁ గాపాడుచున్నారో యటులనే స్వసంఘీయులగు హిందువులు (పెక్కండ్రు) తాము నమ్మి మతమును గాపాడవలసినదిగాఁ గోరుచుండఁ గాంగ్రెసువారు సనాతనుల నమ్మకము తప్పనుటకును నది మతమునకు సంబంధించదని యనుటకు వ్యక్తిస్వాతంత్ర్యము కలిగి యుండవచ్చునే కాని సనాతనులతో భిన్నాభిప్రాయము కలిగినంతమాత్రమున వారి నిక్కట్టులపాలు చేయుట ధర్మమా? నేఁడిటుల జరిగిన మహమ్మదీయుల మతముపేరిట జరుపు పనులను మతమునకు సంబంధించినవి కావని యనుటకైనఁ గాంగ్రెసువారు సాహసింపఁగలరా? సనాతనులారా! లెండు. మేలుకొనుఁడు. మన మతమును గాపాడుకొనవలసిన సమయము వచ్చినది. అవసరమగునెడల సహాయనిరాకరణపద్ధతి నవలంబించియైనను మతమును రక్షించవలసియున్నది. అప్పుడుగాని కాంగ్రెసువారి భ్రమ వీడదు. సనాతనులను నిర్లక్ష్యముగాఁ జూచు స్థితి మాఱవలెను. మాఱఁగలదు. వెంటనే గ్రామములందు సనాతనప్రచారము జరిపించి పీఠాధిపతులు మొదలగువారు పై సంస్కరణముల కనుకూలురగువారి పట్టీలను బ్రతికూలురగువారి పట్టీలను సిద్ధము చేయించుట యవసరము. ఇదియే సనాతనులు చేయవలసిన కార్యవిధానము.

సనాతనుల కొక హెచ్చరిక

(గాడేపల్లి వీరరాఘవశాస్త్రిగారు, శతావధాని, గద్వాల)

మహాశయులారా ? మీరు సనాతనులనియు మీమూలమునఁ బ్రతిరోధుల కుహనాతంత్రములను గడువఁగలమనియు నమాయికజానపదులు ప్రోత్సాహములకు

లొంగి తనుధన మనోబలము లర్పించుచున్నారనుట మీరు ప్రకటించు సంస్థల నామ వాచకములలోఁ దెలియుచున్నది. కాని మన మే కొంచెమైన సహాయ మొనరించితిమా ? ఎందుకుఁ జేయఁజాలకున్నాము ? చేయఁజాలనపు డేదైన భంగ్యంతర మాలోచించవలయునుగదా యను తీవ్రాందోళన మెచ్చటను జరిగించుట లేదు. శత్రుశాసనప్రకోప మనిష్టదాయకము కానపు డుదాసీనముగ నున్నను బ్రమాద ములోఁ జేరదు. బలవత్ప్రశేకముగ దశదిశల శాసనరూప కాలపాశములై మతసంప్రదాయముఁ గీలడలించిన బొమ్మలవలె నో తగిల్లఁజేసి జోలఁబాడుచుండ నిర్వీర్య దేవతోపాసనలతో నామకార్థసభలతోఁ దంత్రోటకములు పన్నిన నేమిలాభము ? కొంచె మాలోచింపుఁడు.

శారదాబిల్లు మూర్తీభవించె. తదనర్థప్రతీకారారంభమునకై చేతులెత్తి సభలని నేఁటివఱ కెన్ని సంఘములు ? ఎందఱు ప్రవక్తలు ? ఎన్ని రాయబారములు ? చివరకు ఫలము మృగ్యము. ఇట్లగుటకుఁ గారణ మేమి? మనకు ధారాళముగఁ దోఁచునది దుండగీండ్ర సంఖ్య యెక్కువ. వారికి జాతిభ్రంశధర్మావలంబనమునఁ బట్టుదల యెక్కువ. సంఘీభావము వారికి వజ్రకవచము - ప్రభుసానుభూతి యనుకూల వాతావరణము. కనుక వారి క్లైదిరించుచున్నారనఁదగియున్నది. మన సనాతనులకవి యన్నియు వ్యతిరేకార్థములే యగుటవలన ఫలము వ్యతిరేక మగుచున్నదని సమన్వయింతురు. అగుఁగాక.

మన మొనరించు విధానము నిష్కళంకమై యాచరణయోగ్యమై యప్రతిహత ధర్మప్రబోధమై ప్రతివాదులు నోరైన మెదలింపరాని వాకట్టుగలదియై యుండినదియు వమ్మైనపుడు దైవికమనియో కాలగతియనియో మనము పైనుదాహరించిన స్వాహాపరంపరలో మేళవింపవచ్చును. మనప్రయత్నములు హాస్యాస్పదములగుచున్నప్పుడు మన యల్పాల్పప్రయత్నలోప మెక్కువ నష్టదాయకమై యపజయ ధ్వజముగ నితరులచే శాశ్వతగ్రంథరూపముగఁగూడఁ బ్రతిఘటన నిష్ఫలత తన్మూలమున హాస్యము శేషింపఁగలదు. మన ప్రయత్నమే యప్రతిహత దార్ష్టాంతికమైన విజయ మొనగూడుట దైవికమే యైనను శాశ్వతగ్రంథచిహ్నితముగ నిరంకుశ హిందూ సనాతనధర్మ సిద్ధాంతములైనఁ దేజరిల్లఁగలవు.

ప్రభుసానుభూతి వారి కున్న లోకప్రభువగు పరమేశ్వరసానుభూతి సనాతనులకు లేదా? అంతకంటె ననుకూల వాతావరణ మరయవలయునా? అక్కఱలేదు సర్వదా భగవద్గుణశీల ప్రవచనులగు సనాతనుల ధిషణాచాకచక్యమున కేపతితకోటి వలననో పరాభవమా? మన సంఘీభావదౌర్బల్యము మన విధానదౌర్బల్యము, మన ముంచిన నాయకుల దృగ్దౌర్బల్యము, మన ముపయోగించుకొను సాధనీభూతుల దౌర్బల్యము.

శ్లో॥ వేదండగండకండూతిపాండిత్యపరిపంథినా ।
హరిణా హరిణాలీషు కథ్యతాం కఃపరాక్రమః ॥

అనినట్లు మన ప్రయత్నమున నుద్రేకదోహలత పెచ్చుపెఱుఁగవలసియున్నది.

నే నభినవసరస్వతీ పత్రికాముఖమున దుష్పరిణామము రానున్నదని కాంగ్రెసు వారిని గుఱిఁజేసి నోటీసుగ జవాబిచ్చుటకు సనాతనులజోలికి మీరు రాను హక్కులేదనియు జవాబులు మీ రీయక యెదిరించినచో మీయహింసా శాంతితత్త్వములకు విరోధమనియు దౌర్జన్య పశుబలములే మీకును శరణ్యములని మీరనిన మేమును బ్రతిక్రియ లవలంబించుదుమనియు నూహ కనఁబఱచితిని. రెండుమాసము లైనను నాపత్రిక కాంగ్రెసువారు చిత్తగించిరో లేదో గోచరింపలేదు. తుదకు సనాతనసంప్రదాయసంఘజ్ఞులైన దాని విధానము చదివిన ట్లేపత్రికలలో బయ లెక్కింపలేదు. అప్రకార మన్నిమండలములనుండి యన్నిపత్రికలలో జవాబులు మన మడిగిన వా రొసఁగుటయా ? వినుగుటయా ? తెలదా ! దీర్ఘనిద్రాళువులై నాలుక లేని ఘంటలవలె జీవచ్ఛవములే వారి దృష్టికి గోచరించుటవలనఁ జట్టముగఁ గూడ మెలచి మన మతధర్మముల మెడ నురి గుఱిఁజేయుచున్నారు. మీ రింకను మును పవజయములొందుచున్న ప్రెసిడెంట్లే మునుపటి కార్యదర్శులే మునుపటి ధర్మ శాస్త్రములె మునుపటి ఖర్చుల బిల్లులే యప్పటి బల్లలే యీ యనాలోచితాపరిచిత సభాప్రవేశనిర్ధారణములే చేయ సమకట్టితిరి. తుద కేమూర్ఖుఁడైన నొకసారి యొక సాధనముతో నొక మార్గమున నోటమిగల్గిన రెండవసారి వేఱొకసాధనముతో నుపాయాంతర మవలోకించి కార్యము సాధించును. మీవిధా దృగ్విధానములలోఁ గాలము మాఱుచున్నదనియు లక్ష్యము మార్చికొట్టవలయు ననియు నటువంటిసంఘ ములను జేర్చవలెనను కార్యశూరత తోఁపలేదు.

దయచేసి పత్రికలలో వివిధసనాతనసంఘములకును విషయనిర్ధారణాంశములు ప్రకటించి శాస్త్రము నాచరణముఁ బ్రయోజనము ననాచరణమునఁ గల్గు ముఖ్యోపద్రవములు రుజువొనర్చుటకు వారివారి శక్తియుక్తులతో నిర్ధరించి కేంద్రస్థానములకుఁ బంపున ట్లొనరించి విషయనిర్ధారణసభలలో ఘంటాటంకారము స్ఫుటీకరింపుఁడు. ఒకమాఱు దయచేసి యావ్యాసంగ మొనరింపఁదలఁచు సోదరు లభినవసరస్వతిలోని (ఆగష్టునెల) నావ్యాసమును జూడుఁడు. బహిష్కరణసూత్రము వేదకాలము నుండికలదనుట కీపతితసంకరబహిష్కారకారణమే చిహ్నము. అదియే నింద్యమని యద్యతనులు మఱువుపట్ల వీరి బహిష్కారోద్యమము గతియేమి? వీరి విదేశవస్తు బహిష్కృతి ప్రభుశాసన బహిష్కృతికంటె వేదమాత బహిష్కృతి కనిష్ఠమని వీరు దేనితో యుక్తివాదముతోనా శాస్త్రవాదముతోనా ప్రయోజనవాదముతోనా ఎట్లు సిద్ధాంతీకరింపఁగలరు?

పిడిశాస్త్రవాదము లిదానీంతనులలో హాస్యాస్పదములు. వారిదృష్టిని వాక్కును వారిపురోభివృద్ధిని బంధించు వేదశాస్త్రాచరణప్రయోజనయుక్తివాదములుగల మేధావుల నుభయకులపితామహులుగ నిగ్రహించుకొని యీవిపత్తున మునుఁగనున్న సనాతనపథమును జాగరూకులై నడుపుఁడు. నాయకులముగ నున్నామని కన్నులు మూయుచు నిన్నినాళ్ళవలెనే మఠములవలె మఠాచార్యులవలె సంఘనాయకులు వినాయకులై కార్యదర్శులు దర్శులై సభికులు సభీకులై సదస్యులు దస్యులై మూఱ

చ్ఛేదములకుఁ గినుకలాడకుఁడు. రానున్న గాఢప్రమాద మనవలీఢులై ప్రమత్తతతోఁ బాడొనరింతురని నుడువుచున్నానని మన్నింపుఁడు.

ప్రతిరోధించి కాంగ్రెసు చట్టనిర్ధారణ చేయుపట్ల వోట్లకూళ్ళలోఁ గాలు పెట్టి మీరు నడువుఁడు. మీ సీటుంగతి చెప్పెదమని ప్రతిసనాతనాభిమాని భ్రుకుటి నిటలమున ముడిఁబెట్టిన నిపుడు ప్రమాత మెండలు సమర్థులు లేకున్నారు? వారికి మన విరోధాప్తితో మన మొనరించు సానుభూతులుగూడ వారు విస్మరించినను మనము వినుచవలెను.

కాంగ్రెసుమహాశయులకు సనాతనులు.

ఏరుదాఁటి పడవ తగులఁబెట్టినట్లు మీరు ప్రబుద్ధులగుటకు మీపై నేకాగ్రత మీరీపరిపాలనస్థానము లాక్రమించుట హిరణ్యకశిపు రావణకుంభకర్ణాది దుర్వారాసుర విజృంభణముల ననుకరించుచున్నది. ఏలయన! ధర్మమార్గము లరయరు. మీ రాలుఁగరు. వినరు. మీకు వాగ్బంధమొనరించు నోటీసు లిచ్చినను మీవాద దుర్బలత్వము చూచుకొనక లోకమును దార్మ్యాలుచేయ నెంచుచున్నారు.

మీరు నుడువుచున్న సత్యాహింసా దౌర్జన్యరాహిత్య ప్రజారంజనాది శబ్దములు నిరర్థకములుగ నగుట నెఱిఁగియు మేల్కొని నిద్రవోవుచు సనాతన వైదిక ధర్మములమీఁది కక్రమరథమును దోలుచున్నారు. బహిష్కరణసూత్రములోఁబుట్టి దానిని ధరించి దానితో రక్షింపఁబడుచు నట్టిది వేదమాత మనకుఁ బ్రసాదించి యమలునందుంచిన మార్గమని తలఁపక యా త్రితమార్గమును మొదలంట నఱికి సున్నము పెట్టఁ దలంచితిరా? చిగురునఁజెప్పిన బహిష్కారసూత్రము (బాయ్‌కాట్) మీకుఁ బ్రాణప్రయాణములకవసరమని యెఱిఁగియు వేదోదితమార్గమునే బహిష్కరించుచున్నారా? మీరు బహిష్కరించువారపాత్రులు, వేదబహిష్కృతులు పాత్రులా? వేదములిచ్చిన బహిష్కరణాయుధము ప్రాణప్రదముగ ధరించి వేదముమీఁదనే దాని నుపయోగించుట కేవల భస్మాసుర వరసంప్రదాయమా? కాదా! మాకంటెఁ బ్రభువెఁడను దౌర్జన్యరాక్షసప్రభుత్వము లివి గావా! మన మతద్రోహులు యవనులనియు వారు సంప్రదాయ విరుద్ధముగ హిందువుల మనవులు వినక ఘుట్టుపన్నులుంచిరనియుఁ బుక్కిటిపురాణములు చెప్పుచుందురు. ఎన్నిపన్నులుంచినను వారు దుడ్డుమీఁద దాడుచేసిరే కాని మతవిరోధశాసనకల్పన మందునకైన నున్న శ్లేతురుష్కచక్రవర్తులలోనైన దొరకునా? పైపెచ్చు విక్టోరియా మహారాజ్ఞి మీమతముల జోలికి నేను రాను; మీమతసంప్రదాయపాలనమే నేనొనర్తునని భారతభూప్రజాప్రభ్వియై శిలాశాసనముగఁ బ్రాచ్యసనాతనపరిపాలనాధురీణమకుట హీరాయమానముగ నేఁటికిని గీర్తిదేహమున హిందూమనఃఫలకములలోఁ దళతళలాడుచు గోచరించుచున్నది.

మూఁడాదివారముల పట్టపగలు ప్రభుత్వము మీకు వచ్చి రాకముందే యీ సనాతన ధర్మములఁ గూలఁద్రోసినఁగాని మీ రర్హులని శాశ్వతపట్టాగా మీకు భారత రాజ్యాంగము నెత్తికెత్తరని మురియుచుంటిరేమో కదా! అగర్భశ్రీమంతులుచక్రవర్తులు

మహారాజులు వారేకులమందు జన్మించినను బరాత్పరుని చిత్కళ వారియందుఁ దాండవించి కరుణాస్రవంతిని స్రవించక మానదు. మీరో పుట్టుక శకోశములలో నో భగవన్నిర్మాణమైనను ఘృతకోశములవలె భృతకోపాధ్యాయవిధ్యున్ముక్తులై యుండును గురుజన ప్రభుజన సనాతనావలంబన పథములకు దూరగులై రాజదండన ప్రజా వైతండిక మండన శౌండీర్యాజగాఁభీర్యచర్యాపారగులై సర్వజ్ఞత పాటించుచున్నారు. మీప్రభుత్వము లచిరమనియు మీధోరణి మీరచన లోకమునకు బడిపోతమై కృతిగేయమగుననియుఁ దలఁపరైతిరి. నటకుఁడు రాత్రియాటలో నిషధ నేలి దమయంతి విరాళి గొని తెల్లవారి తనను నవ్వు పారిహాసకుల కెదుట లేపద్రవ్యము పోఁగడిగి గీటిన కాట్లయినఁబోక నవ్వుబాటగు టెఱుఁగఁడు. అట్లే మీరు సనాతనముల నెదిరించిన మిమ్ముల నెట్లు లాటీలఁ బ్రభువులు రాజద్రోహులుగ గణించి శిక్షించిరో మీ రట్లే మీనాల్గువారములలో సనాతనులను బాధింపుఁడు; రాఁబోవు జన్మములందైన నిత్యోప్యధిక బాధాపాదకులలో నేకనొకచో టందుదురు. తురక తురకవానితోఁ దలపడి గెలువలేక క్రిందఁబడి రొమ్ముమీఁదఁ గూర్చున్న తురకతో రే పేహిందువుఁడైన నాకు దొరకఁడా! నే నిట్లేకూర్చుండనా యనియనినాఁడఁట. ఆసామెతగా మీరు సనాతనులను బాధింపఁదలఁచితిరి. మేమో! దైవచోదితుల మగుటవలనఁ బరమాణుపర్యంత శకలీభూతుల మగుటకుఁ జూచెదము. మీపోలిక దొరలు శకములు నీశ్వరమార్గమున నెన్ని క్షుణ్ణము కానున్నవో! మీ రిప్పటి మత్తుతో నెఱుఁగకున్నను, నచిరమే గుర్తెఱుఁగఁగలరని తలఁచుచు మాకర్తవ్యమును నెఱవేర్చుచున్నాము.

మీకన్నుల యెదుటఁ జేతులెత్తు సంఖ్య లల్పమని సనాతన మల్పముగఁ బరిగణించి స్వల్పశత్రుత్వమని తృణీకరించితిరా? అది మాసంఘీభావమునకు మీజీర్ణదశకుఁ బునాది కాఁగలదు. ఇఁక శేషించునది మీరిప్పుడు హిందువులకు దయాళువులై ప్రసాదించునది జాతిభ్రంశమే! వర్షాకాలనదీప్రవాహము నిత్యమని పడవల వ్యాపారమున కొడిగట్టినవాఁడు శరదృతువులో నిసుకదిబ్బల వాల్మీకి కిష్కింధకాండలోని వర్ణనశ్లోకమును జ్ఞప్తిదెచ్చుకొనినచో నావ్యాపారమున కుద్యాపనమంత్రము లప్పుడే చెప్పఁడా?

శ్లో॥ దర్శయంతి శరన్నద్యః పులినాని శనైశ్శనైః
నవసంగమసవ్రీడా జఘనానీవ యోషితః॥

అలాగుననే మీప్రభుత్వము మూడువారములలో మిమ్ములను నమ్మి వేదశాస్త్రపురాణధర్మమార్గములను జిమ్మి క్షణికమైన మీప్రభుత్వ మూడి మంచమును విడఁదీసిన కోడులవలె మీరు పడియుండు కాలమున మీకును మీపతితకోటికిని శరణ్యమరణ్యరోదనమేనా! మఱేమైన నున్నదా? అట్టిగడియ పురోవర్తిగ లేదనుట కే పారంపర్యాయప్రవాహముగల చక్రవర్తులైన సర్వ మీశ్వరాధీనమని యనుచు వారిని మీవంటి యుద్రేకపూరితులై తనువు మఱచువారికి మేకులవలె ముద్రించియుంచినారే. స్వభావముతోనే యనిత్యమైన వృత్రభోగమున కీయాత్రత లపాత్రత లేల? నిలిచి విద్వాంసుల నవలోకించి విధినియమలాభనష్టము లాలోచించి యవసరమైన

నిరుత్తరకోటిగ సనాతనుల నెదిరించి వాక్స్తంభన మొనరింపఁ దపంబొనరింపుఁడు. మీ నవనాగరకవిద్వాంసుల గుమిగూర్పుఁడు. తిరిగి కాలేజీలలో విశ్వవిద్యాలయములలో విదేశీయ హేలాపాలితకళాశాలలలో కాలికొలఁది వెళ్ళి మీరు సమకూరు విజ్ఞానముతో నా తపంబున వరప్రసాదులై సనాతనుల వాగ్బంధ మొనరించి యొప్పించి చట్టము నల్లుఁడు మేమును జవాబు ఋజుమార్గమున నీఁజాలనపుడు దాసోహమనమా? అట్లొనర్పక యీయూఁక దంపుడు పాటలతోఁ జేతులెత్తించి రేమెఱుఁగని పతితుల నర్థపతితుల గుంపుకట్టుకొని యనర్థముల కొడిగట్టఁదలఁచిన మీవిద్యాప్రవీణత యుక్తివాదము లోకోపకృతియనుట గుట్టలకెక్కినట్లేనా? కాదా? మా కోడికి మూఁడే కాళ్ళని పల్కుటయా? మఱేమి? దీనిఁ బరమేశ్వరుఁడైన గాదనలేఁడుకదా? దూరమాలోచించి మీదయవచ్చిన మార్గగాము లగుఁడు. అగడువట్టు మార్గమున మాత్ర మడుగుంచకుఁడు. మడుగులోఁబడ్డ బల్లులై తరువాత విచారపడకుఁడు. మీ రస్థిరులు. మీయందు మూర్తీభవించినవి మీకంటె నస్థిరములైన పునాదులు - సనాతనము లెన్నినాళ్ళపునాదులో మీ రెఱుఁగరు. మే మెఱుఁగము. మీకిపుడవి బొత్తుగా గోచరాతీతములు. చెట్టుత్రొక్కినవాఁడు తెన్నుగానని తెఱంగునఁ బండ్లుగొఱికి జంఘపుష్టిఁజూపి నష్టమార్గమునఁ జొఱకుఁడు.

సర్వేశ్వరుఁ డొసగూర్చిన కించిదధికారమును దుర్వ్యయ మొనర్పకుఁడు. నొప్పింపక తానొవ్వక తప్పించుక తిరుగువాఁడు ధన్యుఁడు సుమతీ యను వానికే కాలేజీలలోఁ బరిషత్తు సర్టిఫికెట్టు లేకున్నను బరమదేశికస్థానముమాత్ర మాతని కిచ్చిన మేలొదవఁగలదేమో యని తలచెద. చిత్తగింపుఁడు.

సనాతనధర్మపరుల ప్రస్తావములు - తీర్మానముల ఛాయలు.

దేశోపకారమునకును స్వాతంత్ర్యమునకును పాటుపడుచున్న కాంగ్రెస్ ప్రతినిధులు గడచిన యెన్నికలలో నెక్కువమంది యెన్నుకొనఁబడి దేశపరిపాలనమునఁ గొంతయధికారమును వహించుట యందఱకు మిగుల సంతోషదాయకము.

దేశమును భాషాప్రయుక్తరాష్ట్రములుగా విభజించి పరిపాలించుటకై యట్టి రాష్ట్రనిర్మాణమునకుఁ బ్రయత్నింపవలసినదిగాఁ బ్రజలు కోరుకోర్కె న్యాయ్యము.

ఆంధ్రదేశమున కాంధ్రభాష ముఖ్యము. ఆంధ్రభాషకు సంస్కృతభాష మాతృప్రాయ. సంస్కృత సంకలితముగాని యాంధ్రము సంకుచితమై సన్నగిలి పోవును. కాన నీ రెండు భాషల నత్యంతాభివృద్ధికిఁ దెచ్చు బాధ్యతతో శాసనసభవా రఖిలభారత దేశసౌకర్యము నిమిత్తము హిందీభాషను వృద్ధిపఱతురేని యట్టిప్రయత్న మంగీకార్యము.

ఆర్థికముగా నెక్కువదుస్థితిలోనున్న యేజాతివారికైనను బ్రభుత్వమువారు విద్యాభివృద్ధికిఁగాని ప్రభుత్వోద్యోగముల నిచ్చు విషయములలోఁగాని గ్రామపారిశుద్ధ్యవిషయములోఁగాని తక్కినజాతులవారితోపాటు సుస్థితి గలిగించుటకుఁ జేయు ప్రయత్నముల కామోదించుచున్నాము.

ఆర్థికముగా దుస్థితిలోనున్న వ్యావసాయికులయుఁ జాలివారియుఁ గూలివారియు ఋణబాధానివృత్తికిఁ బ్రభుత్వమువారు తోడ్పడి దారి చూపి ఋణదాతలను సమాధానపఱచి వారిచేత సదుపాయములను జేయించుట న్యాయ్యము. గవర్నమెంటు వారును, కో, ఆపరేటివు సంఘములవారునుఁ దమకు బీదరయితులవలన రావలసిన ద్రవ్యమును రాఁబట్టుకొనుటకుఁ గట్టుదిట్టములు చేసికొని, ఋణములనిచ్చిన దేశస్థులను మాత్రము సదుపాయములు చేయుఁడని నిర్బంధించుట న్యాయ్యముగాదు. ఇందువల్ల రయితులు గ్రామములోనున్న పరపతిచెడి చేబదులుకూడఁ బుట్టక యెక్కువ నష్టపడుటయే కాని లాభమెక్కువ యుండదు గనుక నీవిషయమై ప్రభుత్వమువారు రయితుల కుపకారము చూపుట యవసరము.

సంఘసంస్కర్తల దుష్ప్రచారమువలనఁ గొలఁదిమంది వర్ణాశ్రమ ధర్మపరిపాలనయందశ్రద్ధతో విదేశాచారముల నవలంబించుచున్నను నిప్పటికి గ్రామములలోని చాతుర్వర్ణ్యమునకుఁజెందిన నూటికి తొంబదితొమ్మిదిమంది సనాతనవర్ణాశ్రమ ధర్మావలంబులుగనుక మతసంబంధమయిన పంచమదేవాలయ ప్రవేశము, అస్పృశ్యతా నివారణము, అసవర్ణవివాహము, రజస్వలా వివాహము, వివాహవిచ్ఛేదము మొదలగు విషయములలో నెవరి యిష్టమువచ్చినట్లు వారు ప్రవర్తించుచున్నను నితరులచేఁ బ్రవర్తింపఁజేయుటకు వారెట్టి ప్రయత్నములు చేయుచున్నను నిప్పటికి సనాతనధర్మమే మంచిదనినమ్మి చేతనయినంతవఱకు దాని ననుసరించుచున్న వారిజన్మస్వాతంత్ర్యమును శాసనపాశముల నరికట్టుటకు శాసనసభ్యులు ప్రయత్నింపఁగూడదు. కడచిన యెన్నికలలో సభ్యత్వమునకుఁ బ్రచారము జరిగినప్పుడు ప్రజల కార్థికముగా సాయము చేయుదుమని ప్రచురించినారు కాని మతవిషయములలో జోక్యము గలుగఁజేసికొనెదమని యెవ్వరును బ్రకటన చేసియుండలేదు. కాన సదాచారములకు మతధర్మములకు వ్యతిరేకముగా యం. శి. రాజాగారు ప్రవేశపెట్టెదమని ప్రచురపఱచిన దేవాలయ ప్రవేశపుబిల్లునుగాని సుబ్బరామరెడ్డియార్ గారు ప్రవేశపెట్టెదమని ప్రచురించిన బిల్లునుగాని యిఁక నితరసభ్యు లుద్దేశించి ప్రవేశపెట్టఁబోవు మతసంబంధమగు బిల్లులనుగాని యంగీకరింపరాదనియు, పాసు చేయింపరాదనియు మతసంబంధమగు శాసనములఁ బ్రవేశపెట్టువిషయమున నెన్నఁటికిని నెట్టిజోక్యముఁగలుగఁజేసికొనకుండవలెననియుఁ బ్రార్థించుచున్నవారము.

ఇట్లని గవర్నరుగారికిని మంత్రులకును శాసనసభ్యులకును దెలియఁజేయుట కాంధ్రదేశసనాతనవర్ణాశ్రమధర్మోద్ధారకసంఘమువారిని బ్రార్థించుచున్నాము.

(అ. ఆం.)

—♦ పెన్షను పుచ్చుకొన్న యుద్యోగస్థులు ♦—

లోకములోఁ జాల విచిత్రములున్నవి కాని పెన్షనుబుచ్చుకొన్న యుద్యోగస్థుల వంటి విచిత్రము మఱియొకటి లేదు. సాధారణముగాఁ జాలమంది యుద్యోగస్థు

లిష్టముతోఁ బెన్షనును బుచ్చుకోరు. కాని 55 ఏళ్లు దాఁటునప్పటికి సర్కారువారి రూల్సడ్డమువచ్చును. పని చేయలేఁడని డాక్టరు సర్టిఫికేట్టిచ్చును. పనిచాలించుకోక తప్పకవచ్చును. అయితేఁ బనిచాలించుకొన్న మరుసటిరోజునుండి పాప మీయన యేమిచేయును? ఇంటిలో నేమియుఁదోచదు. ప్రివిలేజి లీవులుకూడ ననుభవించకుండ నేవిద్యాగోష్ఠియందును మనస్సు పోనీయకుండ జపతపాలన్నియు మానివేసి రాత్రింబగళ్ళు దస్త్రాలు ముందఱవేసికొని పనిచేయు నాయనను బనిచాలించుకొని యింటిలోఁ గూర్చుండుమన్నఁ గాలముగడచుటెట్లు? ప్రజలకోసము పనిచేయుట యన్న నేమిటో వీరెఱుఁగరు. మ్యునిసిపాలిటీ మెంబరు కావుటయన్న గిట్టదు. శాసననిర్మాణసభలకుఁ బోవుటయనిన భయము. 30 ఏండ్లు దొరతనమువారి యుత్తరువుల నొక్కయక్షరము పొల్లయినను బోకుండ దిద్దినవారిని సర్కారువారికి భిన్నముగా మాటలాడుమన్న నెట్లు?

నీటిలోనుండి బయటఁబడ్డ చేపవలె గిలగిల కొట్టుకొందురు. వెనుక నొక ఖైదీ చెఱసాలలో 40 ఏండ్లున్నాడట. కాలమంతయుఁ జెఱసాలలోనే గడచిపోయినది. తల నెరసినది. ఒడలంతయు ముడతలు పడ్డది. పండ్లూడిపోయినవి. కఱ్ఱలేకుండ నడవలేఁడు. ఆశలన్నియు నుడిగిపోయినవి. అప్పుడు వానిని వదలిపెట్టినారఁట. చెఱసాలల గోడలు దాఁటి బయటకువచ్చి చూచునప్పటికి లోకమంతయు వానికసహ్యముగాఁ గనఁబడ్డదఁట. బయటి జనమంతయు వెఱ్ఱివాండ్రవలెఁ గనఁబడిరట. "నాకీస్వేచ్ఛ బాగుండలేదు. చెఱసాలయే బాగుగానున్నది. మరల ఖైదీగాఁ దీసుకొండ"ని బతిమాలుకొన్నాఁడఁట. అట్లున్నది మన యుద్యోగస్థులసంగతి పెన్షను పుచ్చుకొన్న రెండవరోజునుంచి రోజులెట్లైనను గడచునా? పాపము వీరికిఁ గాలమెట్లుగడపవలెనో తెలియక దస్త్రాలు దస్కతులు వదలిపోయినవని దిగులుపడి కృశించి శీఘ్రముగాఁ బరమపదింతురు. ఆపెన్షనును నాలుగేండ్లపాటైనను ననుభవించరు. ఇంతకంటె విచారకరమైనసంగతి యేమున్నది?

కొందఱెట్లో పాఁకులాడి దివానుపనియో యెస్టేటు మేనేజరుపనియో సంపాదించి పోయిన యధికారమును దస్త్రాలను దిరిగి తెచ్చుకొందురు. ఈపను లెంతమందికి లభించును? దొరతనమువారి యనుగ్రహాన నిప్పుడు వీరిపంట పండినది. క్రొత్తగా నానరరీ మేజస్ట్రీట్లు డిప్యూటీకలెక్టర్లు నేర్పాటయినారు. ఆనరరీ యన్న జీతము భత్యము లేని నవుకరీ యన్నమాట. అధికారాలుపోయిన పెన్షనరులు వీనికి తయారవుదురు. జీవితకాలమంతయు సర్కారుకు ధారపోసి పెన్షను దెచ్చుకొనుచున్నప్పుడింతమాత్రము కృతజ్ఞతయైన నుండవద్దా? కృతజ్ఞత యెవరి కందురేమో? సర్కారువారికిన్ని బెన్షనర్లకుఁగూడ. అధికారాలు పోయినవారి కధికారాలు తిరిగి యిచ్చినందుకు సర్కారువారికి వెట్టిచాకిరీ చేయుట కొప్పుకొన్నందుకుఁ బెన్షనరులకు నొకరిపై నొకరు కృతజ్ఞత చూపుకోవలసినదే. ఏమైతేనేమి? ద్రవ్యనష్టి లేకుండ సర్కారువారు పనిచేయించుకొనుట యొకటి కనఁబడుచున్నది. ఇఁక నానరరీమునసబులను జడ్జీలను నేర్పాటుచేసి యీముదుసళ్ళకు గతి చూపింతురఁట.

సర్కారు నవుకరి మహిమ యేమిటోగాని, దానిలోనికిఁబోయిన మనుష్యుఁడు మరల నేలాగను దక్కఁడుగదా! వానికి నవుకరియే ప్రపంచము. దైవము, సర్వము నదే. మోక్షముకూడ నదే. వారికి వేఱుచదువు లుండవు. ఇతర వ్యాసంగా లుండవు. నూతులలోని తాఁబేళ్ళవలెఁ దమలోఁ దాము ముడుచుకొనిపోదురు. త్వరగా నవుకరి వదలుకొని యేదైనను బ్రజల కుపయోగమైన పని చేసెదమని కలలైనను గనుదురేమో యన్న సంభవింపదే. ఒక యుత్సాహము లేదు. ఒక యాశ లేదు. ఒక త్యాగము లేదు. ఒక ధర్మము లేదు. పూర్వము మనలో వర్ణాశ్రమధర్మ లుండునవి. కొంతవయస్సు ముదిరినపిమ్మట వానప్రస్థము సన్యాసము ననునవి యుండునవి. ఇప్పు డవి యన్నియు నడుగంటినవి. చచ్చుదాఁక నవుకరియే. రూపాయలకొలుచే, దస్త్రాలమోతే. ఒక సంగీతము నొకసాహిత్యము నొకభక్తి యనునది యేమైనను నుండినవా? పోనీ చాకిరీచేయవలెనన్నఁ బంచాయతీకోర్టులు పెట్టుకోఁగూడదూ? ఉచితపాఠశాలలు పెట్టఁగూడదూ? చేయవలెనన్న నెన్నిపనులైనను నున్నవి. జన్మాంతరమనునది యొకటి యున్నదని యిప్పటి నవనాగరికులు నమ్మరుకాని పెన్షనుబుచ్చుకొని చాకిరికోసము పెనుగులాడువారు వచ్చుజన్మలో నేమయిపుట్టుదురో? (కృష్ణ)

—♦ పోష్టుటెలిగ్రాఫుశాఖ ♦—

1933, 37 సం॥లలోఁ బోస్టుటెలిగ్రాఫుశాఖ యెటులఁ బనిచేసినదియు వివరించుచు నీశాఖయొక్క పరమార్థ మతిసమర్థతతోఁ బ్రజాసేవచేయుటయే యని డైరెక్టరు జనరలుగారు చెప్పిరి. అది మిగులఁ బ్రశంసనీయమగు భావ మనుటకు సందియములేదు. బ్రిటిషుప్రభుత్వమువలనఁగల్గిన లాభములలోఁ బోస్టు టెలిగ్రాఫు శాఖ యొకటియని చదువుకొను పిల్లలకును దెలియును. ఈసౌకర్యము దినదినాభివృద్ధి యగుటయు సంతసింపఁదగి యున్నది. వార్తలు దూరదేశములనుండియైనను వినుట కవకాశములు చేయఁబడినవి. తంతిరూపముగఁ బంపుటలోను సౌకర్యము లెక్కువైనవి. మంచిదే కాని వీని ఖర్చు నందఱును భరింపలేరనియు నందఱకు నందుబాటులో నుండునటుల సౌకర్యములు చేసినపుడే వానియుపయోగము జనసామాన్యమునకుఁ దెలియుననియుఁ జెప్పఁగోరెదము. ఈసందర్భమున గ్రామములలోఁ బోస్టు టెలిగ్రాఫుసౌకర్యములఁ గూర్చియుఁ గార్డు కవరు బుక్కుపోస్టు వగైరాల ధరలఁగూర్చియు ... వివరించు టవసరమైయున్నది. కానీ కార్డు నర్ధణా కవరు నున్న రోజులకును వానిని పెంచినరోజులకును బోల్చిచూచినయెడలఁ బ్రజల భాగ్యమేమియు నభివృద్ధికాలేదని తెలియఁగలదు. కార్డు కానీనుండి 3 కానుల వఱకుఁ బెరిగినందువలన దాని నుపయోగించుకోలేని జన మెందఱో యున్నారు. అప్లీకవరులవిషయమునను జెప్పవలయును. తులమునకు మించకున్న నణా చాలునన్నను నాధారమునుగూర్చి తెలియకపోవుటచేత నదనముగ డబ్బు వసూలుచేయు

టయు సంభవించుచున్నది. కనీసభారము నెక్కువచేయవలసియుండును. తులము బరువు కర్ధణాలైన నుంచవలెను. పత్రికలకును గానీచీటి యంటించినఁ జాలునన్నను నాసౌకర్యము నెక్కువచేయవలసియున్నది. వార్తలెక్కువై వార్తలను దెప్పించుటకగు ఖర్చెక్కువయై యెక్కువపారటలు వేయవలసిన యవసర మేర్పడుచుండ నిందును గనీసభారము నెక్కువచేయవలెనని కోరెదము. ఇట్లు కోరుటకును నీ సం॥ మనుకూలముగనున్నది. ఈ సం॥ ఈశాఖకు 14½ లక్షలు లాభము వచ్చినది ... కార్డు కవరు ఖరీదును దగ్గించి సౌకర్యమును జేసినయెడల నాదాయ మెక్కువగుననియు లాభమును మించుననియు మానమ్మకము. 1921, 22 సం॥ లతోఁ బోల్చినయెడలఁ గార్డుల ఖర్చు చాలఁ దగ్గెననియుఁ గవరుల ఖర్చును దగ్గెననియు నివేదికమునందుఁ గాన్పించుచున్నది. ఈతగ్గుదలకుఁ గారణము కార్డుఖరీదు మబ్బడి యగుటయే. ప్రజాసౌకర్యమునకు వీని ఖరీదు తగ్గించుటయు నవసరమైయున్నది.

(ఆంధ్ర)

—♦ చేరిగొండ ధర్మన ♦—

(శేషాద్రిరమణకవులు)

ఇతఁడు చిత్రభారతమను పద్యకావ్యమును రచించి చిత్తాపుఖానుని మంత్రి యగు నినుములపల్లి పెద్దయామాత్యున కంకితముగావించెను. ధర్మనకవి కిష్టదైవము ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి. ఈధర్మపురి నిజాముదేశములో గోదావరీతీరమున నున్నది. ధర్మనకు ధర్మపురియను నామాంతరము గలదు. పుణ్యక్షేత్రనామములు వ్యక్తినామములుగ నుంట తఱచుగాఁ జూచుచున్నారము. ఈధర్మపురిని గూర్చియే నృసింహశతకము ధర్మపురిరామాయణముఁ గానవచ్చుచున్నవి. చరిగొండ ధర్మన యీగ్రామనివాసియని యూహింప నవకాశములు గలవు. ధర్మపురిలోఁ జాల శాసనములు దివ్యక్షేత్రములగు నాలయములు శాస్త్రపారంగతులగు బ్రాహ్మణులుఁ గలరు. చరికొండ నరసింహకవి శశిబిందుచరిత్రముఁ జరికొండ హొన్నయ్యకవి జ్యోతిషరత్నాకరము రచించిరి. వీరు ధర్మపురి సమీపవాస్తవ్యులుఁ జరికొండ ధర్మకవివంశములోనివారు నైయుందురని తోఁచుచున్నది.

—♦ అసూయ ♦—

(శ్రీనాథుని కాశీఖండము)

క॥ సిద్ధింప వీప్సితంబులు సిద్ధించినవేని బిదపఁ జెడు నన్యుని సం
వృద్ధిఁగనుంగొని యెవ్వని బుద్ధి నసూయాగ్రహంబు వొడము నతని
తే. గీ. అప్రయోజన మభివృద్ధి నతిశయిల్లు [నికిన్.
అప్రయోజన మడఁగుఁ గాలాంతరమున
అకట! ఈర్ష్యాగ్రహగ్రస్తుఁ డైనయట్టి
ఖలుని సంపద విధవచన్నులును బోలె. తృ. ఆ. 8

సీ. శ్రీమనోహారమగుఁ జెలి శ్రుతిద్వయము. వి
ద్యున్మాల విలసన మువిదమేను
భ్రమరలలిత మింతి భ్రమరకజాలంబు.
మత్తహంసివిధంబు మానినిగతి
సరసిజంబు విభాతి తెలవ నేత్రయుగంబు.
మత్తకోకిల చాన మహితవాణి
ధర భుజంగప్రయాతము వధూమణి వేణి.
పృథ్వి పెంపున మీఱు వెలఁది శ్రోణి
ధరణిధరగతి సఖి కుచద్వంద్వ మమరు.
చంద్రరేఖాకృతి వహించు సతి యలికము.
రమణి యిటు కవిరాజవిరాజితంబు
గాన సరసప్రబంధమై క్రాలుచుండు. 69

సీ. కలికి ముఖముఁ జూచికాఁబోలు నలినారి
నలినారి కృశభావకలితుఁడగుట !
కలికి కన్గవఁ జూచికాఁబోల్తుఁ దామరల్
తామరులై నీటఁ దపముఁగొంట !
కలికి కంఠముఁ జూచికాఁబోలు దరము తా
దర మొంది నీరధి నిరవుకొనుట !
కలికి గాత్రముఁ జూచికాఁబోలుఁ జంచల
చంచలమై మేఘసమితి నుంట !
తన్నఖాల్ గని కాఁబోలుఁ దారకములు
తారకములయి వినువీథిఁ జేరియుంట !
పడఁతి జడఁగని కాఁబోలుఁ బాములెల్ల
బాములొందుచుఁ బుట్టలఁ బట్టువడుట ! 70

క. నగమా కుచయుగళము ? ప
న్నగమా పరికింప వేణి నాతుకకు ? మరు
న్నగమా యౌదార్యం ? బె
న్నఁగ మాకుం దరమె దీని నవయౌవనముల్ ? 71

తే. తరుణి కురులను తేఁటులు శిరమువలన
నుండి యొకకొన్ని దిగజారి యొగిని వక్త్ర
పంకరుహగంధ మానెడు భావమునను
ఘ్రాణచాంపేయముం గాంచి కరము భయము
నంది మోమున నిల్చెనా నలక లొప్పె. 72

సీ. కాంచనాళులు సదా మించి(నస్నేహంబు)
గల్గి దా మొక్కట వెల్గుచుంట!
బింబంబు శుకమును భేద మింతయు లేక
చెలిమితో నొక్కటఁ జెలఁగుచుంట!
సరసీరుహాబ్జులు కర మనురక్తిచే
మిళితమై యొక్కట మెలఁగుచుంట!
పంచాస్యనాగముల్ వైరంబులు త్యజించి
నెమ్మిమై నొక్కట నిలిచియుంట!
చూడఁ బరమేష్ఠి యిట్టులఁ జోద్యముగను
తనదు నేర్పొప్ప నిర్మించె ఘనతమీఱ
గాత్రచికురోష్ఠనాసికానేత్రవక్త్ర
మధ్యయానంబులుగను నిమ్మానవతిని. 73

తే. తొలుతఁ గృష్ణాహి పొక్కిలిబిలము వెడలి
తెలివ కుచదుర్గసీమ నతిక్రమించి
వదనసోముని గ్రహియింప వచ్చుచుండె
ననఁగ నొప్పారెఁ గన్నె నూగారు తీరు. 74

వ. ఇట్లు వెలుఁగుచుండ నొక్కనాఁ డఖర్వభుజార్గళ నిరర్గళప్రతాప ప్రదీపిత భూనభోంతరాళుండును శాత్రవగర్వ తమోనిరాసవిద్యోతమానఖద్యోతుండును నఖిలోర్వీరమణశిరోభాగమణిమకుటఘటితారుణచరణ నఖరనికరుండును సప్తాంభోధివేష్టిత బంధుర వసుంధరాభారధౌరేయుండును నైన శర్యాతిధరాపాలకుండు మంత్రిసామంతపురోహిత విద్వజ్జనాదులు గొలువ వందిమాగధబృందంబులందంద కైవారంబు లొనర్ప దుష్టనిగ్రహ శిష్టరక్షణైకపరాయ

ణుండై నానామృగవ్రాతపరీవృతుండైన మృగరాజునుంబోలె
రాత్రీశాశ్మప్రభాభాసమానకిరీటంబు శిరంబునఁ బూర్వాగశిఖరో
దయ రాకాబ్జరేఖ ననుకరింపఁ బేరోలగంబున నుండు నవసరం
బున 75

క. కొందఱు మానీంద్రులు రా
నం దెదురుగ నాతఁ డేగి యతివినయమునన్
డెందంబున భక్తియు నా
నందముఁ దళుకొత్తఁ దెచ్చి నయమార్గమునన్. 76

క. ఉచితాసనములు వారికి
రచియించి నృపాలుఁ డపుడు రాజితలీలన్
వచియించె మీర లిటురా
ఖచరస్తుతులార ! శుభముగాంచితి మిగులన్. 77

క. మీ రిపు డిట కేతెంచిన
కారణమును దెల్పుఁ డనుడుఁ గడువడి వా రో
ధారుణినాయక ! మే మా
ఘోరమృగావళుల బాధకున్ భీతిలుచున్. 78

క. వచ్చితి మనవుడు వారికి
పొచ్చెములేనట్టి భక్తి పొడమఁగ నభయం
బిచ్చి మహీపాలకుఁ డను
అచ్చటివారెల్ల వినఁగ నతినిష్ఠురతన్. 79

క. మీరందఱు వీక్షింపఁగ। ఘోరాటవి కేగియందుఁ గ్రూరమృగములన్
పోరాడి చంపి తాపస। వారంబులభయమునింకఁ బాయఁగఁ జేతున్.

వ. అని 81

సీ. కేతనాది విభూషణాతిరేకము లొచు
కనకాద్రిఁ బురుడించు ఘనరథములు
స్ఫురదహార్యశ్రేణి ధరఁ గూల్పఁ దార్కొను
దార్ఢ్యంబు గల్గు మాతంగసమితి

గంధవాహాశ్వ వేగస్ఫూర్తి నిరసించు
జవగల్గినట్టి సైంధవచయంబు
పులిమీసములను నుయ్యాల లూఁగఁగా నేర్చు
పటుశూర బహు వీరభటగణంబు
ఓలి నడువఁగఁ దత్పాదధూళి నింగి
కెగసి చదలేటి బంగారుతొగలపైని
చెలఁగు షట్పాడితోడఁ దా నలమికొనఁగ
నరవి నొకనాఁడు కానకుఁ జనె విభుండు. 82

సీ. విలుచాలు మొదట. నవ్వలఁ జాపముల వారు.
ఆవెన్క సెలగోల. లవల గజము.
లోపిఱుందను ఘోటకావళి. అటుమీఁద
అరదమ్ము. లాపజ్జ ధరణిపాలుఁ.
డాపార్శ్వముల మంత్రు. లాదట హితబృంద.
మాక్రేవఁ బటహ కాహళులు భేరు.
లొగి నార్చుచును బల్లెమురులు బోనులు కత్తు
లలుఁగు లీఁటెలు శ్వానములును మఱియుఁ
జిపురుగండెలు నొకకొన్ని చేతఁబూని
గూనివీఁపులుఁ గెంజాయకుఱుచమీస
లిఱుకుభుజములు మిడిగుడ్లు కఱకునెరులు
బెళుకుచూపులు విలసిల్లు నెఱుకు లంత. 83

సీ. ఘుర్ఘురధ్వని శైలగుహాలు ఘోషింపంగ
వచ్చెడు కిటినైన వ్రచ్చివైతు.
మదకుంభి కుంభస్థ మాంస మాస్వాదింప
ఏగు సింహమునైన నాఁగఁజేతు.
దిగ్భిత్తులెల్లను దీర్ణముల్ గాఁగ రా
వముసల్పు పులినైనఁ బడఁగవైతు.
కటశాఖ లిలఁ బడఁగూల్చి ఘీంకారించు
మదకరీంద్రమునైన మాఱుకొందు.

—♦ అన్నపై వచ్చిన యసత్యపురిపోర్టుకేసు ♦—

ఆరిపోర్టు పట్టుకొని యస్మద్గ్రామమునకుఁ బోలీసువారు విచారింపవచ్చిరి. వచ్చునప్పటికి రిపోర్టిచ్చిన యన్న యెక్కడికో పోయియుండెను. అహితు లప్పట్ల నవ్వారికి లంచమిచ్చి యారిపోర్టసత్యమైనదని వ్రాయించుటయు నది క్రమముగా సబ్ మేజస్ట్రేటు విచారించి యసత్యపురిపోర్టనియే యన్న యప్పయ్యను బ్రాసిక్యూషను జేసెను. తహాశ్శీలుదారు దాని మరల విచారించెను. ఆయనయు సత్యమయిన రిపోర్టు నసత్యమని నమ్మెను. అట్లు నమ్ముటకుఁ దగిన యత్నమంతయు నహితు లాచరించిరి. అందుల కర్హమైన కాగితములు కొన్ని యస్మత్సమీపమునుండికూడ నార్జించిరి. దానను దీనను దహాశ్శీలుదారు తద్దయు శిక్షించుటకుఁ దలపడియెను. అయ్యది కనిపెట్టి పులిపాక పూర్ణయ్యగారు పోరాడి యాయన యధికారమును మించిన సెక్షనాకేసులోఁ గనఁబఱచుటయు, నక్రమముగా నాకేసు సబ్‌కలెక్టరు సమీపమునకుఁ జనవలసివచ్చెను. ఆయన యతిజాగరూకతతో నది విచారించెను. అప్పట్ల నన్యాయ్యము కాని యంశమున నన్న శిక్షింపఁబడనుండుట కలమటపడి జానపాడు పిడుగురాళ్ళ గ్రామస్థు లనేకులు సాక్ష్యములు చెప్పుటయు సబ్‌కలెక్టరు సత్యమును గ్రహించి మత్సహోదరునిమీఁది కేసు త్రోసివేసెను.

ఆకేసుమధ్యమున నన్న కాపద వాటిల్లునేమో యను నగడును లేనిపోనిది కొనితెచ్చుకొనెనన్న క్రోధమును బేరేప నీక్రిందిపద్యములు నేను వ్రాసియుంటిని.

చ. అగణితబుద్ధిమేధుఁడు మదగ్రజుఁ డెక్కడఁ జిక్కఁబోఁడటం
చాగి మది నిశ్చయించుకొని యుంటి సధైర్యత నయ్యొ యన్నయా!
పగర మదం బడంచుటకు బాట లనేకము లుండియుండ ని
ప్పగిది రిపోర్టువ్రాసి యదె పైఁబడ వేసికొనంగఁ జెల్లునే ? 1

చం. పసికరపాముపోలె నోరుపైకి నొకింతయు రానియట్టి యా
పసుపు విలేజిమున్సిఫును సంకటపెట్ట నెడంద నెంచి నీ
పస వెసఁ జూపఁబోయి యిటు పైఁబడ వేసికొనంగఁ జెల్లునే ?
పసికరపాముమాత్ర మది పైని బడం గఱవక యతింపదే ? 2

సీ. కడజాతివానికిం గడుఁ గష్టమనిపించు
బూతులు తిట్టుచుం బాగులఁ జేయ
ఈవె యీాఁదగియున్న హెచ్చుబుణాలకై
కంప్లైంట్లుచేయించి కష్టపెట్ట
లేనితగాదాలు లెక్కించి పెట్టుచు
పీఁతిమైఁ జేలెల్ల బీళ్ళువెట్ట

తపోప్పు లరయుక దండముల్ పెట్టుచు
చీటికి మాటికిం జీట్లు పంప
నీదుతమ్ముఁ డుండ నీవన్యుపై రిపో
ర్టిచ్చి యక్కటకట ! చిక్కువడితి
మేఁత మేయఁబోవ మెడకుఁ దగుల్కొన్న
చందమయ్యె నీదుచర్య యన్న ! 3

చ. వడి నొకవేళ నుచ్చ్రదశ వర్తిలు నీమదిఁ దోఁపకుండినన్
గుడగుడ నల్లవేళలను గోప్యములాడుచు నంతికస్థుఁడై
కుడిభుజమట్లు నీకుఁ దమిగొల్పు చినప్పయయైనఁ జెప్పఁడే
ఇడకు రిపోర్టటంచుఁ దన యేలికపైఁగల సౌహృదంబునన్ ? 4

ఉ. అన్న ! యథార్థ మారసియొ యారయ లేకయొ కారలోపలన్
కర్నినఁ ద్రోయుష్టేసనుకు హ్రాయఁగఁబడ్డ రిపోర్టుగాని నీ
వున్నది కాగితంబుఁ గల మూరకయంచు లిఖించుచుంటకున్
నన్నుగుఱించి చూపుచు వినమ్రితఁ బంపెడి యుత్తరంబొకో ? 5

అట్లధికవ్యయప్రయాసలతో నన్న యెట్లో యొడ్డునఁబడి యంతపనిగావించినయమిత్రులకచిరకాలముననే మరల నాపద తెచ్చిపెట్టుట కాలోచించెను. చినప్పయ్యయుఁ దానును గలసి చేయఁదగిన ప్రయత్నములు చేసిరి. మువురు శత్రువుల మూలఁద్రోయుటకు ముందొక వల యల్లిరి. ఆ వలలో నేలూరు నాగయ్య యేలూరు లక్ష్మినారాయణ యను నిరువు రనపరాధులఁగూడ వచ్చిపడిరి. ఈయిరువురికిని గొబ్బి నాగన్న గొబ్బి సుబ్బన్న యను గొల్ల లిరువురు నొక ప్రాంసెరినోటు వ్రాసియిచ్చియుండిరి. అది వ్రాసినది జానపాటి రత్నయ్య. ఏలూరు మల్లయ్యయు జానపాటి సుబ్బయ్యయు సాక్షులు. ఈనోటుపుట్టినతేది వ్రాయించియిచ్చినవారిలో రెండవవాఁడైన సుబ్బన్న తెనాలి తాలూకా చివలూరుగ్రామమం దుండినట్లు చినప్పయ్య పెదప్పయ్యలచేఁ జిక్కుకట్టి యల్లఁబడియెను. చివలూరు విలేజిమునసఫుకోర్టులోఁ జిన్న నేరమే సుబ్బన్నపై వచ్చి యాతారీఖున విచారింపఁబడినట్లును నదియే తేది వాఁ డొకకొర్దు జానపాటియందున్న తన యన్నకు వ్రాసినట్లును దానిపైఁ దత్సమీపస్థమగు నందిగాలుగు పోస్టుముద్రయు సృష్టింపఁబడియెను.

—♦ అహితులపై నన్న సృష్టించిన ఫోర్జరి కేసు ♦—

ఫోర్జరి చేసిరని పూర్వోక్త పురుషపంచకముపై గురిజాల సబ్ మేజస్ట్రేటు కోర్టులో గొబ్బి నాగన్నద్వారమునఁ జార్జీ పెట్టింపఁబడియెను. అప్పటికి సరిగా నన్నకును నాకును బగవచ్చి పదియైదుమాసము లైనది. ఈయన్నదమ్ముల పోరాటము నేకుల కసమ్మతమైయున్నది. అట్లు సమ్మతిలేకుండ నున్నవారిలో నగ్రగణ్యులు

పులిపాక పూర్ణయ్యగారును బంగనామాల నరసింగరావుగారును. వీరిరువురుం బెద్ద ప్లీడరులు. ఇరవు నరసారావుపేట. అందుం బూర్ణయ్యగారు పూర్వభార్యంగోల్పోయి పునర్వివాహము చేసికొనుచు మా యన్నదమ్ముల నిరువుర నాహ్వానించుటయు సభయులము నర్సారావుపేట కరిగితిమి. నాలుగైదుదినము లుంటిమి. అప్పట్ల నన్నదమ్ముల కిరువురకును సానుకూల్యము గలిగించుట కా న్యాయవాది ప్రముఖులు యత్నించిరి. మే మన్యోన్యదోషోద్ఘాటనములో నహములు పుచ్చితిమి. కాని వారికోరిక తీరుపమైతిమి. పరస్పరపూర్వపక్షసిద్ధాంతములతోం బరిణయముపరిసమాప్తమయ్యెను. ఏరి యూళ్ళకు వార లేగవలసిన సమయ మేతెంచెను ఇరువురకును హితులగు నిద్దఱు ప్లీడరులును బేరోలగముం దీర్చిరి. సహోదరుల సంవాదమును శ్రద్ధతో శ్రవణించిరి. అయ్యది తుదముట్టనట్లు తోంచుటయు నరసింగరావుగారు నాకే యెదురుతిరిగిరి. నీవే దుర్మార్గుండవని నిందించిరి. స్నేహితుండు విద్వత్పక్షపాతి న్యాయవాది నన్నుం బట్టుకొని యీవే దుర్మార్గుండవని యొగ్గించుటయు నీవే రేతీరున నశించునో యీరలే చెప్పుండని యెంతయు వేడుకొంటిని. చేసినదోషమును క్షమింపుమని జ్యేష్ఠభ్రాత పదముల వ్రాలింగాని యీపేరు నశింపదని యాప్లీడరు బదులుచెప్పెను. అగుంగాక యని యాక్షణమ లేచి యన్న యంఘ్రులం బడితిని. సాష్టాంగనమస్కారము సల్పితిని. క్షమింపుమంటిని. భ్రాత బదులుపలుకండు. న్యాయవాదు లిరువురు నన్ను వదలి యన్నం బట్టిరి. క్షమించితిననియుం బగ దిగనాడి భ్రాతృవాత్సల్య మింకం బాటింతుననియు ననుపర్యంతము పట్టువిడుపకపోయిరి. అనిపించిరి. పదియేను మాసములనుండి ప్రవృద్ధమగుచున్న భ్రాతృద్వయముపగ పదినిమిషములలోం బంగనామాల నరసింగరావుగారు పటాపంచలు చేసెను. సహోదరుల కిరువురకును సఖ్యము కుదిరెనన్న సంగతి జానపాటికిం దెలిసెను. శత్రువులు సంధిగనిపెట్టి సహోదరుని సాధించుటకు మహోపాయ మొకటి మరల నెమకిరి. అగ్రజుండును నేనును నత్యంత శత్రుత్వముతో నున్నప్పు డస్మదీయ పుస్తకపేటి యొకటి యాయన శత్రువులలో నొకరగు కరణము తమ్ముండు జానపాటి సీతారామయ్యయింటం బెట్టియుంటిని. ఆయనయే యాపార్టీకి మొనగాండు. ఆలోచనకర్త. ఆ సీతారామయ్య నాతో నిదివఱకు మీ రేకాకులగుట మాయింటం బెట్టె నుంచినను బ్రకృత మన్నదమ్ములు కలసితిరి కావున మీయింటనే పెట్టికొనుండని గుప్తముగా నడుగున సత్తురూపాయలుంచి నాపెట్టె నాయింటికిం బంపించెను. తరువాత నెపుడో ప్రస్తావవశమున మా యన్నను బడంగొట్టితిమనికూడం బలికెను గాని యింతపని చేసెనని యేను గ్రహింపలేకపోయితిని. అంత నాపనిమీంద నే నేయూరికో వెళ్ళితిని. ఫోర్జరికేసు విచారించి మేజస్ట్రేటు పురుషపంచకమునకు రిమెండిచ్చెను. వారి రోదనము మెండయ్యెను. ఏదోషము నెఱుంగని యేనుగుర నిట్లు బందీకృతులంజేసిన భ్రాతను బలువురు గర్హించిరి. ముద్దయిల మొర విన్నకొలంది సబ్మేజస్ట్రేటుకుంగూడ సహోదరునిపై మహాగ్రహ ముదయించెను. అయ్యది గ్రహించి యహితు లపుడే యన్నపై సత్తురూపాయలకేసు తెచ్చిపెట్టిరి. కేసు దాఖలుచేయుటతోడనే యా సబ్మేజస్ట్రి [illegible] వారంటు జారీచేసెను. సమీపమునకుం గొనితేంబడుటతోడనే రిమెండిచ్చెను. రిమెండీందగినవాండు కాండని సుమారు 3 గంటలు పులిపాక పూర్ణయ్యగారు పలువిధ

ముల వాదించిరి. స్వయముగా జామీను పడిరెదమనిరి. సబ్ మేజస్ట్రేటు సమ్మతింపక సర్చివారంటుగూడ జారీచేసెను. అయ్యది పట్టుకొని యమిత్రులదిరే రాత్రి పిడుగురాళ్ళ పోలీసుష్టేసనునకుఁ బేరెమెత్తిరి. సార్జంటును వెంటఁబెట్టుకొని జానపాటికిఁ జనుదెంచిరి. నాయింటికి నడచిరి. సూర్యోదయము కాకమున్నే సోదాచేసిరి. విదితమైన విషయమే కనుకఁ జట్టనఁ బెట్టియనే పట్టుకొనిరి. సందులం దుండియున్న సత్తురూపాయలం దీసిరి. జరుపవలసిన పరిభవము జరిపి మఱిపోయిరి. ఇల్లు నాదే కాని యేనుమాత్రి మట లేను. అన్న కుటుంబ మున్నయది. ఆయన కడియపుఁ దగవునాఁడు పోయి పత్సా సుదర్శనశాస్త్రులయింటఁ బ్రవేశించినను దరువాత నరుదెంచి తన యెద్దులకొట్టములోనే తంటాలు పడుచున్నాఁడు. ఆకొట్టు మస్మద్గృహము నంటుకొనియే యున్నయది. ఒకటే యిల్లె యుభయులముఁ బంచుకొన్నదగుట రెండుభాగముల నడుమ ద్వార ముండుచున్నది. అన్నదమ్ముల కానుకూల్యము కలిగిన యనంతర మావాఁకిలి తలుపుతీసి యుభయత్రియుభయులము నుండుచున్నవారము. అందువలననే యహితు లట్టు లాచరించిరి. అట్లాచరితాకృత్యులై యవ్వార లవల నరుగుటయు నన్న యర్ధాంగి యగ్గలం బంగలార్చి యానాఁడు నేను క్షేమవరమం దుండుట విని యేమానిసినో పంపించెను. పగలు 4 గంటల కాపంపఁబడినవాఁడటకు వచ్చునప్పటి కష్టావధానము నాచే నాచరింపించుట కాయూరఁ గొందఱు ప్రముఖు లంతయు నాయత్తపఱచియుండిరి. ఆరంభము కాఁబోవుచుండెను. అట్టి పరిషన్మధ్యమం దాసీనుఁడనగు నన్నవలకుఁ బిలిచి యన్న యవమాన మాయరుదెంచినవాఁ డెఱింగించుటయు హృదయమం దించుకసేపు పరితాపపడి యెరికి నీసంగతి చెప్పక యాత్మీయగ్రామమున కరుగవలసిన యవసర మేర్పడెనని యష్టావధాన మాపి యపుడే బయలువెడలి యర్ధరాత్రమున కస్మద్గృహముఁ జేరితిని.

సత్తురూపాయల కేసు.

అన్నమును నీళ్ళను వర్జించి యలమటించు నగ్రజుకుటుంబము నవలోకించితిని. అరగంటసే పేమియుంటినో యేమో తిరిగి నరసారావుపేట కరుగుటకు నడుముకట్టితిని. ఆకాలమున యానసౌకర్యము అంతగా లేవు కనుకనే క్షేమవరమునుండి కాలినడకనే కదలి వచ్చితిని. నరసారావుపేటకుమాత్రము తురగముపై బయలుదేరితిని. ఇరువదిమైళ్ళను నడిపించి యెనిమిది గంటల కేగితిని. ఏకుసరికి నరసింగరావుగారును బూర్ణయ్యగారును బేలునకును, ట్రాన్సఫరునకును బిటీషను సిద్ధముచేయుచున్నారు. పంచాశద్రూప్యములిచ్చి భాగినేయుఁడు వంగనామాల నరసింగరావుగారిచేఁ బయనము చేయించినాఁడు. గుంటూరుకుఁ గొంపోయినాఁడు. చేయవలసినపని జెడ్జికోర్టులోఁ జేయఁబడినది. బేలుమీఁద విడుదలకును గురిజాల మేజస్ట్రేటువద్దనుండి కేసు ట్రాన్సఫరునకును నార్డరు పడినది. ఆరాత్రి మూఁడుగంటల కయ్యార్డరు నర్సారావుపేటకుఁ దేఁబడినది. నాచేతి కీఁబడినది. నే నానిమిషముననే గుఱ్ఱపుబండియొకటి కట్టించుకొని గురిజాలకు బయలువెడలితిని. ఇరువదిక్రోసులు నడిపించి మఱునాఁడు మధ్యాహ్నమునకు సరిగా సబ్ మేజస్ట్రేటుకు నాయార్డరు చూపించి సహోదరుని జామీనుపై విడిపించుకొని స్వగృహమునకుఁ జేరితిని.